




ESTD: 1999
www.voodayam.com

# వుదయం



మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
KAPIL GROUP
కపిల్ చిట్స్
46 years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



వరంగల్ | 18-05-2026 సోమవారం | సంపుటి : 11 | సంచిక : 332 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on


# రూపాయి పతనం

## డాలరుతో పోలిస్తే 96.35కి పడిన రూపాయి విలువ

**పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలు, పెరుగుతున్న**

**ముడి చమురు ధరల నడుమ కనిష్ట స్థాయికి రూపాయి విలువ**

**పెరిగిన ధరలతో యూఎస్ డాలర్ల తరలింపు పెరిగింది : వ్యాపారులు**

కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, బలమైన డాలర్ కారణంగా పెరుగుతున్న ముడి చమురు ధరల ఒత్తిడితో, భారత రూపాయి మరింత బలహీనపడి, సోమవారం అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 96.35 (తాత్కాలిక) వద్ద రికార్డు కనిష్ట స్థాయికి చేరింది. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రపంచ మార్కెట్ సెంటిమెంట్లు క్షీణిస్తూనే ఉన్నాయని ఫారెక్స్ వ్యాపారులు తెలిపారు.





**వుదయం డెస్క్, మే 18 :** భారతదేశంతో సహా వర్ధమాన మార్కెట్ ఆర్థిక వ్యవస్థలు పెరుగుతున్న ముడి చమురు ధరల ఒత్తిడిని ఎదుర్కొంటూనే ఉన్నాయి. ఎందుకంటే, ఇప్పటికే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టిగేషన్స్ (ఎఫ్‌పిఐల) కారణంగా జరుగుతున్న నిధుల తరలింపునకు తోడుగా, పెరిగిన ధరల వల్ల యూఎస్ డాలర్ల తరలింపు కూడా పెరుగుతోందని వ్యాపారులు చెప్తున్నారు. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారక మార్కెట్‌లో, రూపాయి 96.19 వద్ద ప్రారంభమై, యూఎస్ డాలర్‌తో పోలిస్తే మరింత పడిపోయి 96.39కి చేరింది. ఇది దాని మునుపటి విలువతో పోలిస్తే 58 పైసల తగ్గుదలను నమోదు చేసింది. సోమవారం నాటి వాణిజ్య కార్యకలాపాల ముగింపు సమయానికి, రూపాయి విలువ దాని మునుపటి ముగింపు స్థాయి నుండి 54 పైసలు క్షీణించి, 96.35 వద్ద (తాత్కాలికంగా) నమోదైంది. శుక్రవారం నాడు, భారత రూపాయి విలువ యుఎస్‌డి స్థాయి కంటే దిగువకు పడిపోయి, అమెరికన్ డాలరుతో పోలిస్తే 95.81 వద్ద, ఒక చారిత్రక కనిష్ట స్థాయిలో ముగిసింది. బలమైన డాలర్, పెరుగుతున్న యూఎస్ ట్రెజరీ రాబడి నేపథ్యంలో రూపాయి ప్రతికూల ధోరణితో ట్రేడవుతుందని మేము అంచనా వేస్తున్నాం.

మిగతా 2లో

*మే 8తో ముగిసిన వారంలో భారతదేశ విదేశీ మారక నిల్వలు 6.295 బిలియన్ డాలర్లు పెరిగి 696.988 బిలియన్ డాలర్లకు చేరాయని రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం తెలిపింది. వారంలో మొత్తం నిల్వలు 7.794 బిలియన్ డాలర్లు తగ్గి 690.693 బిలియన్ డాలర్లకు పడిపోయాయని గత నివేదిక వెల్లడించింది. ఇదిలా ఉండగా, విలువైన లోహాలపై అధిక కస్టమ్స్ సుంకాలు విధించిన కొద్ది రోజులకే, దేశంలోకి వచ్చే వెండి దిగుమతులను లైసెన్స్ విధానం కిందకు తీసుకు రావడం ద్వారా ప్రభుత్వం శనివారం దాని దిగుమతులపై ఆంక్షలు విధించింది.*



# చెట్లు నరకడానికి వీల్లేదు

**కేబీఆర్ పార్కు చుట్టుపక్కల చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే**

**రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం చెట్లను**

**నరికివేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై కోర్టులో సవాలు**

**హైదరాబాద్, మే 18 (వుదయం ప్రతినిధి) :** హైదరాబాద్ మహానగరానికి ఊపిరితిత్తులుగా ఉన్న కేబీఆర్ జాతీయ పార్కు చుట్టుపక్కల చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు సోమవారం కీలక స్టే విధించింది. రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం చెట్లను నరికివేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం .. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. పార్క్ చుట్టూ ఉన్న 25 నుంచి 35 మీటర్ల పరిధిలోని పర్యావరణ సున్నిత ప్రాంతంలో (ఎకో-సెన్సిటివ్ జోన్) ఎలాంటి చెట్లను నరకడానికి వీల్లేదని జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర హైకోర్టు ఈ వ్యవహారంలో మధ్యంతర ఉపశమనం కల్పించేందుకు నిరాకరించడాన్ని సవాలు చేస్తూ పర్యావరణ సామాజిక కార్యకర్త కాజల్ మహేశ్వరి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ మేరకు స్పందించింది. సుప్రీంకోర్టు స్టే తో రహదారి అభివృద్ధి ప్రణాళిక (ఎస్సార్డీపీ) పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి.

మిగతా 2లో

# విపత్తులపై ప్రభుత్వం అప్రమత్తం

**అగ్ని ప్రమాదాలు, వరదలు సంభవించినప్పుడు**

**ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు**

**రాష్ట్రవ్యాప్తంగా వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు,**

**పారిశ్రామిక ప్రమాదాలపై భారీ మాక్ ఎక్సర్‌సైజ్‌లు**

**సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు,**

**శిక్షణ పొందిన బృందాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి**

**నెక్లెస్ రోడ్‌లో వరద మాక్ డ్రిల్‌ను పరిశీలించిన మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్, మే 18 (వుదయం ప్రతినిధి) :** ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన, శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వద్ద నిర్వహించిన భారీ వరద మాక్ డ్రిల్‌ను సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట అత్యంత కీలకమని, ఆ "గోల్డెన్ అవర్"లో తీసుకునే చర్యలే ప్రాణాలను కాపాడగలవని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు, వరదలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. 1908లో హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి గోదావరి-కృష్ణా వరదలను ప్రస్తావించిన మంత్రి విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన బృందాలు ఎల్లప్పుడూ సిద్ధంగా

మిగతా 2లో

## నెల రోజుల పాటు టీఆర్ఎస్

# జెండా పండుగ

**20వ తేదీ నుంచి జూన్ 20 వరకు జెండా పండుగను నిర్వహించాలి**

**పార్టీ జెండా గద్దె మోడల్ ఆవిష్కరణ**

**టీఆర్ఎస్ చీఫ్ కవిత**



**హైదరాబాద్, మే 18 (ఎఎంఎస్) :** రాష్ట్రవ్యాప్తంగా ఒకే మోడల్ లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దెలు నిర్మిస్తున్నామని పార్టీ చీఫ్ కవిత తెలిపారు. సోమవారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన స్టేట్ జనరల్ బాడీ సమావేశంలో జెండా గద్దెల మోడల్ ను ఆవిష్కరించారు.మూడు ఫీట్ల ఎత్తు, రెండు ఫీట్ల వెడల్పుతో పార్టీ జెండా గద్దెలు నిర్మించాలని సూచించారు. పార్టీ జెండా గద్దె బేస్ ఒక ఫీట్ ఎత్తులో ఉంటుందని పైభాగం మరో రెండు ఫీట్ల ఎత్తులో ఉంటుందని తెలిపారు. జెండా గద్దె బేస్ కు గ్రీన్ కలర్.. పై భాగంలో ఉండే జెండా గద్దె కు ఎల్లో కలర్, దాని మధ్యలో తెలంగాణ మ్యాప్ బ్లూ కలర్ లో ఏర్పాటు చేయాలని సూచించారు.

మిగతా 2లో

## వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు

# పూర్తి చేయండి

## అన్ని మిల్లులు, లారీలు యజమానులు సహకరించాలి



**హమాలీల కొరత లేకుండా చూసుకోవాలి**

**సహకార సంఘాల సెంటర్ల సిబ్బంది తక్కువగా**

**ఉండడం వల్ల ఆ సెంటర్లలో ఇబ్బందులు వస్తున్నాయి**

**కరీంనగర్ జిల్లాలో ధాన్యం**

**కొనుగోళ్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష**

**కరీంనగర్, మే 18 (వుదయం ప్రతినిధి) :** ధాన్యం కొనుగోళ్లు వారం రోజుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లర్ అసోసియేషన్, లారీ అసోసియేషన్ ప్రతినిధులు ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తయ్యేలా సహకరించాలని సూచించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్లో అధికారులు అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరగడానికి మొత్తం వ్యవస్థ పని చేస్తుందన్నారు. కరీంనగర్ జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నులు అంచనా వేశాం.. 314 ధాన్యం కొనుగోలు సెంటర్లలో ఇప్పటికే

మిగతా 2లో



# తెలంగాణ జిల్లాలకు వర్షసూచన

**ద్రోణి, ఉపరితల చక్రవాత ఆవర్తనం ప్రభావంతో నేడు,**

**రేపు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన**

**తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు**

**ఎల్లుండి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెరగనున్న ఎండ తీవ్రత**

2



# పెట్రోల్, డీజిల్ కొరతలేదు

**తెలంగాణలో వదంతులు నమ్మొద్దు**

**సరఫరాను ఓఎంసీలు**

**నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి**

**చమురు మార్కెటింగ్ కంపెనీల వెల్లడి**

**హైదరాబాద్, మే 18 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉన్నాయని ఎక్కడా కొరత లేదని రాష్ట్రంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు స్పష్టం చేశాయి. సరఫరాను ఓఎంసీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని రాష్ట్ర కోఆర్డినేటర్ తెలిపారు.

మిగతా 2లో

## శేషాచలం అడవుల్లో స్థానిక జాతుల

# పునరుద్ధరణకు టిటిడి కృషి

**అటవీ సంపద కాపాడటంలో కృషి కొనసాగాలి**

**ప్రకృతిని పవిత్రంగా భావించడం భారతీయ సంప్రదాయం**

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**



**అమరావతి, మే 18 (వుదయం ప్రతినిధి) :** తిరుమలలో 89.4 శాతం అటవీ విస్తీర్ణం సాధించిన తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. శేషాచలం అడవుల్లో స్థానిక జాతుల పునరుద్ధరణకు టీటీడీ కృషి చేస్తోందని తెలిపారు. అటవీ సంపద పరిరక్షణకు చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రకృతిని పవిత్రంగా భావించడం భారతీయ సంప్రదాయమని సిఎం తెలిపారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ దైవసేవతో సమానమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన తిరుమల అందించాలనే లక్ష్యంతో టీటీడీ చర్యలు చేపట్టిందన్నారు. తిరుమల పర్యావరణ పరిరక్షణలో టీటీడీ చేస్తున్న కృషి అమోఘమని ప్రశంసించారు. శేషాచలం అటవీ సంపద కాపాడటంలో టీటీడీ నిరంతర చర్యలు కొనసాగాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.

# కోమటిరెడ్డిని సీఎం చేయాలి

**బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సిఎం అబద్ధాలు మాట్లాడుతున్నారు**

**పట్టణాన్ని అప్ గ్రేడ్ చేస్తానని ప్రకటించిన కేసిఆర్‌నే ప్రజలు నమ్మలేదు**

**ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా?: ఎంపీ ధర్మపురి అర్వింద్**



**నిజామాబాద్, మే 18 (వుదయం ప్రతినిధి) :** రేవంత్ రెడ్డికి బదులు కోమటిరెడ్డి లాంటి జెన్యూన్ పర్సన్‌ని తెలంగాణ సీఎం గా నియమించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పట్టణాన్ని అప్ గ్రేడ్ చేస్తానని ప్రకటించిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసిఆర్‌నే ప్రజలు నమ్మలేదని.. ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ చురకలు అంటించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. జిల్లాకు పంగనామాలు పెట్టారని ఆయన ఆరోపించారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే వారే బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నించారు. దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయటం లెక్క కాదన్నారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కావని చెప్పారు. ఇప్పటి వరకు నిజామాబాద్ నగరంలో 25 శాతం డ్రైనేజీ పనులు కూడా పూర్తి కాలేదన్నారు. రూ.162 కోట్లకు కేవలం రూ. 10 కోట్ల నిధులు మాత్రమే యుడిసికి ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. 2039 వరకు రాహుల్ ప్రధాని కారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. అంటే రాహుల్ ఇక ప్రధాని కాలేరని తెలంగాణ సీఎం చెప్పారు. తద్వారా ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటుందని తెలంగాణ సీఎం ఒప్పుకున్నారన్నారు.

## బండి సంజయ్

# తప్పు చేయలేదు

**రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయి**

**సంజయ్‌ను లక్ష్యంగా చేసుకొని బీఆర్ఎస్**

**కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తప్పుడు ప్రచారం**

**తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు**



**హైదరాబాద్, మే 18 (వుదయం ప్రతినిధి) :** బిజెపి, కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. వ్యక్తిని, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ''బండి సంజయ్, భాజపాపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. రూ.కోట్లు ఖర్చుపెట్టి రాష్ట్రమంతా పోస్టర్లు వేయించారు. బండి సంజయ్ తప్పు చేయలేదు. ఆయన కుటుంబ సభ్యులు తప్పు చేస్తే.. న్యాయపరంగా చర్యలుంటాయి. సంజయ్‌ను లక్ష్యంగా చేసుకొని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో మహిళలపై 67 శాతం క్రైమ్ రేటు పెరిగింది. జూబ్లీహిల్స్ బాలిక కేసులో కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా?మద్యం కేసులో మహిళ జైలుకు వెళ్తే.. రాజీనామా చేశారా? ఓ మహిళా సర్పంచి తనను బీఆర్ఎస్ ఎమ్మెల్యే లైంగికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేస్తే పార్టీ పరంగా ఏం చర్యలు తీసుకున్నారు? కేటీఆర్‌కు నైతిక విలువలు లేవు. మీ ఇంటి ఆడబిడ్డ తప్పు చేస్తే ఎందుకు రాజీనామా చేయలేదు? ప్రజా సమస్యలపై పోరాటం చేయడం చేతగాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలి. కాళేశ్వరం, ఈ-కారు రేస్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేయాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిశాయి కాబట్టే వారిని అరెస్టు చేయడం లేదు'' అని రామచందర్‌రావు అన్నారు.

# పెట్రోల్, డీజిల్ కొరతలేదు

మొదటి పేజీ తరువాయి

రవాణా, సరఫరా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధిని ఓఎంసీలు నమోదు చేశాయన్నారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహావసర ఎల్పీజీ సిలిండర్ల బుకింగులు తగ్గుముఖం పట్టాయి. ఆందోళనతో వినియోగదారులు ముందస్తు బుకింగులు చేయడం లేదు. ఈనెలలో 17వ తేదీ వరకు మొత్తం 20.06లక్షల ఎల్పీజీ సిలిండర్లను డెలివరీ చేశాం. ఈ సీజన్‌కు



ఇది సాధారణం. ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా ఎల్పీజీ సిలిండర్లు బుక్ చేసుకోవాలని ఎల్పీజీ వినియోగదారులను కంపెనీలు ప్రోత్సహించాయి. ఎల్పీజీ సిలిండర్ల విషయంలో అక్రమాలను అరికట్టేందుకు, అసలైన లబ్ధిదారులకు అందేలా చూసేందుకు ఓటీపీ ఆధారిత సిలిండర్ డెలివరీ విధానమైన డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) వ్యవస్థను అనుసరించాలని కోరుతున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం డీఏసీ విధానం 95 శాతానికి పైగా అమలవుతోంది. రాష్ట్రంలో డీఏసీ అమలు శాతాన్ని వంద శాతానికి చేర్చేందుకు ఓఎంసీలు, గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల సహకారాన్ని కోరుతున్నాయి అని ఓఎంసీలు తెలిపాయి నకిలీ వార్తలు, వదంతులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు ఓఎంసీలు విజ్ఞప్తి చేశాయి.

## తెలంగాణ జిల్లాలకు వర్షసూచన

**హైదరాబాద్, మే 18 (ఎఎంఎస్) :** తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ద్రోణి, ఉపరితల చక్రవాత ఆవర్తనం ప్రభావంతో ఇవాళ, రేపు, ఎల్లుండి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు ఎల్లుండి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. రేపు ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ అయింది. ఇవాళ, రేపు కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశముందని అధికారులు వెల్లడించారు.

## నెల రోజుల పాటు టీఆర్ఎస్ జెండా పండుగ

మొదటి పేజీ తరువాయి



తెలంగాణ మ్యాప్ మధ్యలో ఇంగ్లీష్ అక్షరాల్లో టీఆర్ఎస్ అని రాయాలని సూచించారు. జెండా గద్దె బేస్ గ్రీన్ కలర్ మధ్యలో తెలుగులో తెలంగాణ రక్షణ సేన అని రాయాలని సూచించారు. పార్టీ జెండా కలర్ కోడ్స్ కూడా తాము ఇచ్చిన విధంగానే చూసుకోవాలని.. అప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా జెండాలన్నీ ఏకరూపంలో ఉంటాయని వెల్లడించారు. ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 20 వరకు జెండా పండుగను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

## రూపాయి పతనం

మొదటి పేజీ తరువాయి



కొన సాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడుల నిష్క్రమణలు కూడా రూపాయిపై ఒత్తిడిని పెంచవచ్చు. అయితే, ఆర్‌బిఐ జోక్యం, బంగారం, వెండి దిగుమతులపై కొన్ని ఆంక్షలు తక్కువ స్థాయిలలో రూపాయికి మద్దతు ఇవ్వవచ్చు. యూఎస్‌డీఐఎన్ఆర్ స్పాట్ ధర 96 నుంచి 96.60 శ్రేణిలో ట్రేడవుతుందని అంచనా, అని మిరే అసెట్ షేర్‌ఖాన్, కమోడిటీస్ రీసెర్చ్, రీసెర్చ్ అనలిస్ట్ అనుజ్ చౌదరి అన్నారు. ఆరు కరెన్సీల బాస్కెట్‌తో పోలిస్తే డాలర్ బలాన్ని సూచించే డాలర్ సూచీ, ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరగడం వల్ల 0.14 శాతం తగ్గి 99.14 వద్ద ట్రేడవుతోంది. ప్రపంచ చమురు బెంచ్‌మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్, ఫ్యూచర్స్ ట్రేడ్‌లో 0.65 శాతం పెరిగి బ్యారెల్‌కు 109.97 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు వరుసగా రెండో సెషన్‌లో కూడా నికర కొనుగోలుదారులుగా కొనసాగి, శుక్రవారం రూ. 1,329.17 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. మే 8తో ముగిసిన వారంలో భారతదేశ విదేశీ మారక నిల్వలు 6.295 బిలియన్ డాలర్లు పెరిగి 696.988 బిలియన్ డాలర్లకు చేరాయని రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం తెలిపింది. వారంలో మొత్తం నిల్వలు 7.794 బిలియన్ డాలర్లు తగ్గి 690.693 బిలియన్ డాలర్లకు పడిపోయాయని గత నివేదిక వెల్లడించింది. ఇదిలా ఉండగా, విలువైన లోహాలపై అధిక కస్టమ్స్ సుంకాలు విధించిన కొద్ది రోజులకే, దేశంలోకి వచ్చే వెండి దిగుమతులను లైసెన్స్ విధానం కిందకు తీసుకురావడం ద్వారా ప్రభుత్వం శనివారం దాని దిగుమతులపై ఆంక్షలు విధించింది. మే 13న, ప్రభుత్వం విలువైన లోహాలైన బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 6 శాతం నుండి 15 శాతానికి పెంచింది. దీనితో, (3 శాతం ఐజిఎస్‌టితో కలిపి) మొత్తం ప్రభావవంతమైన సుంకం 18 శాతానికి పైగా చేరింది. అత్యవసరం కాని దిగుమతులను కట్టడి చేయడం ద్వారా విదేశీ మారక ద్రవ్య ప్రవాహాన్ని నియంత్రించే ఉద్దేశంతో ఈ పెంపు జరిగింది.

### బండి భగీరథ్ కేసులో
## దర్యాప్తు ముమ్మరం

నిందితుడి పది మంది స్నేహితులను విచారించిన సిట్

స్నేహితుల ప్రమేయంపైనా ఆరా

**హైదరాబాద్, మే 18 (వుదయం ప్రతినిధి) :** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో మరిన్ని ఆధారాలను సేకరించేందుకు సిట్ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా.. ప్రస్తుతం చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలోనే కేసులో కీలక విషయాలను తెలుసుకునేందుకు సిట్ అధికారులు చర్యలు చేపట్టారు. బండి భగీరథ్ పోక్సో కేసును బయటికి రాకుండా ఉండేందుకు, అతడిని కాపాడేందుకు ప్రయత్నాలు చేసినట్లు భావిస్తున్న 10 మంది ఫ్రెండ్స్‌ను సోమవారం సిట్ అధికారులు విచారణ జరిపారు.ఈ పోక్సో కేసులో బండి భగీరథ్ మాత్రమే కాకుండా.. అతడి స్నేహితుల ప్రమేయంపైనా పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. బాధిత బాలికపై అఘాయిత్యం జరిగినప్పుడు.. బండి భగీరథ్ ఫ్రెండ్స్ కూడా అక్కడే ఉన్నారని.. ఈ ఘటన తర్వాత దాన్ని బయటికి రాకుండా చేసేందుకు వారు తీవ్ర ప్రయత్నాలు చేశారని బాధితురాలి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనడంతో.. వారిని విచారణ చేశారు. ఈ ఘటన మొత్తాన్ని బయటికి రాకుండా రాజీ కుదిర్చాలని ప్రయత్నించారని.. ఈ వ్యవహారాన్ని సెటిల్ చేసేందుకు తీవ్రంగా యత్నించారని బాధితురాలి తల్లి ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే బండి భగీరథ్‌తో సంబంధం ఉన్న 10 మంది ఫ్రెండ్స్ పేర్లను కూడా బాధితురాలి తల్లి పోలీసులకు అందించారు. ఈ నేపథ్యంలోనే బాధితురాలి తల్లి ఇచ్చిన పేర్ల ఆధారంగా సిట్ చీఫ్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలోని పోలీస్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఆమె ఇచ్చిన వివరాల ఆధారంగా 10 మంది బండి భగీరథ్ ఫ్రెండ్స్‌ను ఇవాళ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. వారి నుంచి విషయాలను రాబట్టేందుకు విచారణ జరిపారు. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ విచారణలో.. బండి భగీరథ్ ఫ్రెండ్స్‌ను సిట్ అధికారులు పలు కీలక ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ఆ సంఘటన జరిగిన రోజు అసలు ఏం జరిగింది.. ఆ సమయంలో బాధితురాలు ఏం చెప్పింది.. దానికి బండి భగీరథ్ ఎలా స్పందించాడు.. ఈ విషయంలో రాజీ చేయాలని ఎవరెవరు ఒత్తిడి తీసుకువచ్చారు.. అనే కోణంలో ప్రశ్నలు వేసి.. బండి భగీరథ్ స్నేహితుల నుంచి సమాధానాలను రాబట్టారు. వారు చెప్పిన వివరాల ఆధారంగా వారి స్టేట్‌మెంట్‌ను అధికారికంగా రికార్డ్ చేశారు. ఈ క్రమంలోనే వారి సెల్ ఫోన్లలో ఉన్న కాల్‌డేటాతో పాటు వాట్సాప్ చాటింగ్ హిస్టరీలను కూడా సిట్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ 10 మంది ఇచ్చిన వివరాల ఆధారంగా.. ఈ కేసులో మరింత మందిపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# చెట్లు నరకడానికి వీల్లేదు

మొదటి పేజీ తరువాయి

### బఫర్ జోన్ తగ్గింపుపై తీవ్ర అభ్యంతరం

వన్యప్రాణుల రక్షణ చట్టం, 1972 లోని సెక్షన్ 35 కింద నోటిఫై చేయబడిన కేబీఆర్ నేషనల్ పార్క్ అత్యంత సున్నితమైన పట్టణ అటవీ ప్రాంతమని పిటిషనర్ కోర్టుకు వివరించారు. మొదట ఈ పార్క్ చుట్టూ 25 నుంచి 35 మీటర్ల మేర పర్యావరణ సున్నిత ప్రాంతాన్ని (బఫర్ జోన్) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారని, అయితే వ్యూహాత్మక రహదారి అభివృద్ధి ప్రణాళిక (ఎస్సార్డీపీ) వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం ఈ పరిధిని 3 మీటర్ల నుంచి 29.8 మీటర్లకు దారుణంగా తగ్గించేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇంత తక్కువ బఫర్ జోన్ ఉండటం వల్ల జాతీయ పార్కుకు బాహ్య శబ్దాలు, కాలుష్యం నుంచి లభించే రక్షణ పూర్తిగా దెబ్బతింటుందని, ఇది పర్యావరణ చట్టాల ఆశయానికే విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఈ తగ్గింపుపై కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ 2020 అక్టోబర్ 27న జారీ చేసిన తుది నోటిఫికేషన్‌ను ఆమె సుప్రీంకోర్టులో సవాలు చేశారు.

**ప్రజాభిప్రాయాన్ని తుంగలో తొక్కారు**

బఫర్ జోన్ పరిధిని తగ్గించడం వెనుక ఎలాంటి శాస్త్రీయ లేదా పర్యావరణ అంచనాలు లేవని, కేవలం భూసేకరణ ఖర్చులను తప్పించుకోవడానికి, రోడ్డు ప్రాజెక్టుల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారని పిటిషనర్ ఆరోపించారు. ఈ పర్యావరణ రక్షణ తగ్గింపును వ్యతిరేకిస్తూ దాదాపు 19,000 మందికి పైగా ప్రజలు సంతకాలు చేసి అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, వాటిని అధికారులు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా.. ఈ నోటిఫికేషన్ ఖరారు చేయడానికి ముందు ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ (పబ్లిక్ హియరింగ్) నిర్వహించనప్పటికీ, నిర్వహించినట్లుగా ప్రభుత్వం



తప్పుడు సమాచారం ఇచ్చిందని పిటిషన్‌లో ఆరోపించారు.

**హైకోర్టు ఆదేశాలపై సుప్రీం అసంతృప్తి**

కేబీఆర్ పార్క్ చుట్టుపక్కల నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాల వల్ల పర్యావరణానికి కోలుకోలేని నష్టం వాటిల్లుతోందని, అత్యవసరంగా జోక్యం చేసుకోవాలని గతంలో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించినట్లు పిటిషనర్ తెలిపారు. అయితే, హైకోర్టు మార్చి 31, 2026 నాటి తన ఉత్తర్వుల్లో తక్షణ ఉపశమనం ఇవ్వకుండా.. ఈ జోన్‌లో ఏయే కార్యకలాపాలకు అనుమతి ఉందో పరిశోధన చేయాలంటూ పిటిషనర్లనే ఆదేశిస్తూ తదుపరి విచారణను మే 5కి వాయిదా వేసిందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు, పర్యావరణాన్ని కాపాడటం అత్యంత ఆవశ్యకమని భావిస్తూ తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు చెట్ల నరికివేతపై తక్షణ స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 27వ తేదీకి వాయిదా వేసింది.

# వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయండి

మొదటి పేజీ తరువాయి

3 లక్షల మెట్రిక్ ధాన్యం వచ్చిందని తెలిపారు. జిల్లాకి నిర్దేశించిన లక్ష్యంగా ధాన్యం సేకరణ 100 శాతం పూర్తిచేయాలన్నారు. ఇప్పటి వరకు 1.58 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తి చేశాం అని మిగిలిన 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి అన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సేకరించిన ధాన్యంలో 63 శాతం రూ. 237.39 కోట్లు బ్యాంకుల ద్వారా పేమెంట్ జరిగింది అన్నారు. జిల్లా అధికార యంత్రాంగం సంపూర్ణ సహకారం అందిస్తుంది. అన్ని మిల్లులు, లారీలు యజమానులు సహకరించాలి అని కోరారు. ధాన్యం అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలి అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో, మిల్లుల వద్ద హమాలీల కొరత లేకుండా చూసుకోవాలి అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుకు ధాన్యం తెచ్చి రోజుల తరబడి ఉండడంతో రైతులకు ఇబ్బందులు వచ్చాయన్న ఆయన.. ధాన్యం కొనుగోలు లో హమాలీల కొరత లేకుండా చూసుకోవాలి అన్నారు. సహకార సంఘాల సెంటర్ల సిబ్బంది తక్కువగా ఉండడం వల్ల ఆ సెంటర్లో ఇబ్బందులు వస్తున్నాయి అన్నారు. మహిళా సెంటర్లను ఎంకరేజ్ చేసేలా.. ఐకేపీకి ఇస్తే ఇబ్బందులు రావు అన్నారు. ధాన్యం కొనుగోలు సేకరణ తర్వాత రవాణా ఇబ్బందులు రాకుండా రోడ్ల మీద ఎక్కడ లారీ కనిపించిన లారీలు తీసుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి అన్నారు. రైస్ మిల్లులు అన్ లోడ్ లో ఇబ్బందులు లేకుండా త్వర త్వరగా పూర్తి చేయాలన్న పొన్నం... అదనంగా హమాలీ పెట్టుకొని పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో సన్న బియ్యం ఎంత అవసరమో అంతవరకు సన్న ధాన్యం పండించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల సిద్దిపేటలో రివ్యూ



మీటింగ్ లో అక్కడ లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరం కాగా 70 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లా నుండి వస్తుంది అన్నారు. కరీంనగర్ అలాంటి పరిస్థితి రావద్దు అని సన్న వడ్లు ఎక్కువ పెట్టినప్పుడు ఇలాంటి సమస్యలు రావు అన్నారు. జిల్లాలో రోజుకు 150 లారీలు ఇవ్వడానికి సిద్ధంగా ఉండగా.. మిల్లుల్లో ఒక రోజులో అన్ లోడింగ్ పూర్తి చేస్తే రవాణా ఇబ్బందులు ఉండకపోయేవి అని మిల్లులో రెండు రోజుల పాటు లారీలు ఆగి ఉండడం వల్ల లారీలు ఆగుతున్నాయి అన్నారు.

గత పంట సీజన్ లో మిల్లుల వద్ద అన్ లోడింగ్ సమస్య రాలేదు.. హమాలీలు ఎక్కువగా ఉంచుకోవాలి అని లారీలు ఎప్పటికప్పుడు దించి పంపించాలి అన్నారు. వారం రోజుల్లో 80 వేల మెట్రిక్ టన్నులు తరలించాలి అని సూచించారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద లోకల్ హామీలీలు ఉపయోగించుకోవాలి అన్నారు. మిల్లుల వద్ద పనిచేసే బీహార్ హమాలీలు వాడడం ద్వారా మొత్తం సమస్య వస్తుందని తెలిపారు. గ్రామాల్లో లోకల్ హమాలీలు వాడుకునేలా ఐకేపీ ఇంచార్జిలదే బాధ్యత ఆ దిశగా జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి అని అన్నారు. రైస్ మిల్లులకు, లారీల అసోసియేషన్ లకు ప్రభుత్వం సహకారం అందిస్తుంది అన్నారు. ధాన్యం సేకరణలో రవాణా ఇబ్బందులు లేకుండా పోలీస్, రవాణా శాఖ అధికారులు, లారీ అసోసియేషన్ సమన్వయం చేసుకొని పని చేయాలి తెలిపారు. ధాన్యం సేకరణలో గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, ఏఈవో, మండల స్థాయిలో ఎంపీడీఓ, ఎమ్మార్వో, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, జిల్లా స్థాయిలో సివిల్ సప్లయ్, డీసీవో, మెప్మా, డీఆర్డీఏ, సహకార సంఘాల, రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖ సమన్వయం చేసుకుని పని చేయాలి అని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, వివిధ విభాగాల అధికారులు, రైస్ మిల్లర్ అసోసియేషన్, లారీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మ్యూజియాలు జీవన విధానానికి
# అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

**భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వ సంపద మ్యూజియం**

అంతర్జాతీయ మ్యూజియం

దినోత్సవంలో మంత్రి జూపల్లి

పర్యాటక గైడ్‌లకు ప్రత్యేక

శిక్షణ.. నియామకాలు

రూ. 5 కోట్లు

కేటాయిస్తామని వెల్లడి



**హైదరాబాద్, మే 18 (వుదయం ప్రతినిధి) :** మ్యూజియాలు మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కల్ప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించక పోతే జీవితం సంపూర్ణం కాదని తెలిపారు. రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, కేంద్ర పురావస్తు శాఖ సూపరింటెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ కన్వీనర్ అనురాధ రెడ్డి, డా. ఈమని శివనాగిరెడ్డి పాల్గొన్నారు.



## విపత్తులపై ప్రభుత్వం అప్రమత్తం

మొదటి పేజీ తరువాయి

ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి... పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో మరింత సమర్థవంతమైన విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు.మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్ ను సందర్శించి రెస్క్యూ కార్యకలాపాలను పరిశీలించారు.

రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని మంత్రి పేర్కొంటూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా అధికారులను అభినందించారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ఇవన్నీ పూర్తిగా ముందస్తు సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌లేనని స్పష్టం చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా బాధ్యతాయుతమైన సమాచారమే ప్రజలకు చేరాలన్నారు. ఈ మాక్ డ్రిల్‌లో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్, పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ, హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోవుల అక్రమ తరలింపును అడ్డుకోండి

**డీజీపీ కి రాజాసింగ్ లేఖ**



**హైదరాబాద్, మే 18 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 16న రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని.. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని.. హిందువైనా, ఎంఐఎం నాయకులైనా ఒకే విధంగా చూడాలని అన్నారు. గోవుల అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు.. రాజకీయ ఒత్తిడికి లోనుకాకుండా పని చేయాలని తెలిపారు. హిందువులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రజల్లో అనుమానాలు వస్తాయన్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వం.. అక్రమ రవాణాను ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎవరైనా చట్టం ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని రాజాసింగ్ లేఖలో స్పష్టం చేశారు.

## స్కూల్స్ భారీ డిస్కౌంట్లు

**మే 17, వాషింగ్టన్:** అమెరికాలోని పలు బిజినెస్ స్కూల్స్ ట్యూషన్ ఫీజుల్లో భారీ తగ్గింపులతో పాటు స్కాలర్‌షిప్‌లనూ ఆఫర్ చేసేందుకు ముందుకొస్తున్నాయి. ఏఐ రాకతో జాబ్ మార్కెట్ ప్రభావితం అవుతున్నందున.. బిజినెస్ కోర్సులకు దరఖాస్తులు మందగించడం, ఎంబీఏ విషయంలో అభ్యర్థులు పునరాలోచిస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొన్నట్టు 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్' కథనం పేర్కొంది. అనేక యూనివర్సిటీలు ఆన్‌లైన్, ఎగ్జిక్యూటివ్, స్పెషలైజ్డ్ బిజినెస్ ప్రోగ్రామ్‌లపై ట్యూషన్ ఫీజులను 50 శాతం వరకు తగ్గించాయని.. తక్కువ వ్యవధి కలిగిన, సౌకర్యవంతమైన కోర్సులను అందిస్తున్నాయని పేర్కొంది.కెరీర్ మార్చుకోవాలని, నాయకత్వ స్థానాల్లోకి వెళ్లాలనుకునేవారికి ఈ ఎంబీఏ ప్రోగ్రామ్స్ చాలాకాలంగా ప్రధాన ఎంపికగా ఉంటున్నాయి. అయితే, లేఆఫ్‌లు, కొత్త నియామకాల్లో మందగమనం కారణంగా తాము ప్రస్తుతం చేస్తోన్న పూర్తిస్థాయి ఉద్యోగాలను వదులుకొనేందుకు వృత్తి నిపుణులు వెనకాడుతున్నారు. ప్రముఖ అడ్మిషన్ల కన్సల్టింగ్ సంస్థ 'మై ఎంబీఏ పాథ్' సంస్థ వ్యవస్థాపకులు పెటియా వైట్‌మోర్ మాట్లాడుతూ.. రెండేళ్లు బిజినెస్ స్కూల్‌లో చదివేదానికంటే ఉద్యోగం చేస్తూనే స్కిల్స్ నేర్చుకోవడానికి పలువురు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఈ ట్రెండ్ జాబ్ మార్కెట్‌లో మార్పును సూచిస్తోంది. నియామకాలు జోరుగా సాగుతున్నప్పుడు వృత్తినిపుణులు తరచూ ఉద్యోగాలు మారుతూ ఉండేవారు. దాదాపు అన్ని సంస్థలూ ఏఐను విస్తృతంగా అందిపుచ్చుకుంటున్న నేపథ్యంలో చాలామంది తమ ఉద్యోగం స్థిరత్వంపైనే దృష్టిసారిస్తున్నారు.


## ఈ-గవర్నెన్స్ సేవలు విస్తృతం చేయాలి

**కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ టివి సోమనాథన్**

**హైదరాబాద్, మే 18 (వుదయం ప్రతినిధి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఈ–గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ టివి సోమనాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. సోమవారం కేంద్ర కేబినెట్ సెక్రెటరీ తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ–గవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆయా రాష్ట్రాల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన,మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ–గవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పారదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్ లైన్ లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియజేస్తున్నామన్నారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ–గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కేబినెట్ సెక్రెటరీ సిఎస్ కె. రామకృష్ణారావును ఈ–గవర్నెన్స్ విధానంపై అభినందించారు. ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్యకార్యదర్శి యోగితారాణా, శీకాగోయల్, సెక్రెటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి. గౌతం, సెర్ప్ సిఇఒ దివ్య, తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## ప్రణాళికతో నడుద్దాం.. పుర ప్రగతిని గెలుద్దాం

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. షాద్ నగర్ లో మార్ దాన్ రన్..
- జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్ మే 18 (వుదయం ప్రతినిధి ),




ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేసి పురపాలికను ప్రగతివైపు నడిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని మున్సిపాలిటీ కమిషనర్ సునీత రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పేరిట సాగుతున్న 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా యువతక్రీడలు అనే అంశంపై మార్ దాన్ రన్ ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయం నుంచి పట్టణ ముఖ్య కూడలి వరకు కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జెండా ఊపి ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా పట్టణాలను, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే వార్డులు బాగుపడతాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ అగ్గునూరు బసవేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, ఎంపీడీవో బన్సీలాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కౌన్సిలర్లు పెంటయ్య, మురళీమోహన్ (అప్పి), సంతోషి బాయ్ చందూలాల్, రాజు నాయక్, దిలీప్, బచ్చలి నరేష్, ఎస్పీ శివ, పిన్న మోని గోపాల్, ముబారక్ అలీ ఖాన్, సాధిక్, మాజీ జెడ్పిటిసి వెంకట్రాంరెడ్డి, మండల విద్యాధికారి మనోహర్, నల్లమోని శ్రీధర్, మాధవులు యాదవ్, భరత్ లావోటి, మంగ అశోక్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు..

## షాద్ నగర్ అసెంబ్లీలో కొత్త అధ్యక్షులొచ్చారోచ్

- కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండలాల అధ్యక్షులు ఎంపిక..
- జాబితా విడుదల చేసిన టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్..

షాద్‌నగర్ మే 18 (వుదయం ప్రతినిధి ),



షాద్ నగర్ నియోజకవర్గానికి పట్టణ, మండలాల వారీగా అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ పూర్తి అయింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఈ జాబితాను సోమవారం విడుదల చేశారు. షాద్ నగర్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా అందరూ ఊహించినట్లుగానే నలమోని శ్రీధర్ అవకాశాన్ని అందుకున్నారు. ఇక కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సుదర్శన్ గౌడ్ అవకాశాన్ని రెండోసారి యధావిధిగా దక్కించుకున్నారు. ఇక మండలాల వారిగా తీసుకుంటే ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడిగా కుమ్మరి శ్రీనివాస్, కొందుర్గు మండల అధ్యక్షుడిగా పురుషోత్తం రెడ్డి, చౌదరిగుడా మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్, కొత్తూరు మండల అధ్యక్షుడిగా శేఖర్ రెడ్డి, నందిగామ మండల అధ్యక్షుడిగా కుమారస్వామి, కేశంపేట మండల అధ్యక్షుడుగా రమేష్ ఎన్నికయ్యారు. ఇటీవల వీరి జాబితాను నియోజకవర్గము నుండి అధిష్టానానికి పంపించారు. పరిశీలన అనంతరం అధిష్టానం ఈరోజు నూతన అధ్యక్షుల ప్రక్రియను పూర్తి చేసి అధికారికంగా ఉత్తర్వులను జారీ చేసింది..

## రైతులను ఇబ్బందులు పెట్టొద్దు

లారీల కొరత లేకుండా చూడాలి.
మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి.

మెదక్ జిల్లా, మే 18(వుదయం)



నిజాంపేట మండలం రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నిజాంపేట మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచకుండా వెంటనే రైస్ మిల్లర్లకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో లారీల కొరత లేకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజులు తరబడి ధాన్యం కాపలా కాస్తూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడితే ధాన్యం తడిసి రైతులకు భారీ నష్టం జరుగుతోందన్నారు. రైస్ మిల్లుల్లో కూడా రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ ధాన్యం తరలింపులో ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేశామని గుర్తుచేశారు. రైతుబంధు, రైతు భరోసా పథకాలతో పాటు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించి వ్యవసాయ రంగానికి అండగా నిలిచామని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు మళ్లీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా బండి భగీరథ్ కేసులో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటయ్యాయని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తనే పోలీసులకు అప్పగించానని చెప్పడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న వ్యక్తిపై ఆరోపణలు వచ్చినప్పుడు నిష్పక్షపాత విచారణ జరగడం కష్టమని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో పారదర్శక విచారణ జరిపి బాధిత బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని

## గజ్వేల్ ప్రజావాణిలో డిబిఎఫ్ వినతి

బెజగామలో అంబేద్కర్ భవనం, కొమటిబండ దళిత మహిళకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి
ప్రస్తుతం ఉన్న ఇల్లు కూడా కూలిపోవడంతో, ఆమె నిలువ నీడ లేక గ్రామ కమ్యూనిటీ భవనంలో ఆశ్రయం పొందుతోందని తెలిపారు. అధికారులు స్పందించి, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులోనైనా సదరు మహిళకు ప్రాధాన్యత ఇచ్చి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గజ్వేల్, మే 18 (వుదయం ప్రతినిధి)



గజ్వేల్ మండలం బెజగామ గ్రామ మాల కులస్తులకు అంబేద్కర్ భవనం కేటాయించాలని, అలాగే కొమటిబండ గ్రామానికి చెందిన ఓ నిరుపేద దళిత మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు మాట్లాడుతూ.. బెజగామ గ్రామంలో మాల కులస్తుల కోసం అంబేద్కర్ భవనాన్ని కేటాయించాలనే విషయాన్ని గతంలోనే జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. ఆ సమయంలో మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, ఎస్డీఎఫ్ నిధులు రాగానే భవనాన్ని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మంత్రిగారి హామీని మరోసారి గుర్తుచేస్తూ, భవన మంజూరుకు సహకరించాలని కోరుతూ అంబేద్కర్ సంఘం యూత్ సభ్యులతో కలిసి ప్రజావాణిలో మళ్లీ వినతిపత్రం అందజేసినట్లు వివరించారు.నిలువ నీడ లేని దళిత మహిళకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి గజ్వేల్ మండలం కొమటిబండ గ్రామానికి చెందిన ఒక దళిత మహిళ మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు డిబిఎఫ్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న ఇల్లు కూడా కూలిపోవడంతో, ఆమె నిలువ నీడ లేక గ్రామ కమ్యూనిటీ భవనంలో ఆశ్రయం పొందుతోందని తెలిపారు. అధికారులు స్పందించి, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులోనైనా సదరు మహిళకు ప్రాధాన్యత ఇచ్చి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ నాయకులతో పాటు మధు, కరుణాకర్, ప్రవీణ్ మరియు అంబేద్కర్ సంఘం యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ధ్యేయం

### పెరిగిన ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర ప్రకటించాలి

షాద్‌నగర్ మే 18 (వుదయం ప్రతినిధి ),



తెలంగాణ రక్షణ సేన ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి. ముస్తఫా డిమాండ్కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మద్దతు ధరలు (MSP) ఏమాత్రం సరిపోవని, అరకొర పెంపుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలంగాణ రక్షణ సేన ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి. ముస్తఫా ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, కూలీల రేట్లు మరియు వ్యవసాయ యంత్రాల అద్దెలు విపరీతంగా పెరిగిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో.. కేంద్రం పెంచిన ఈ స్వల్ప ధరలు రైతుల పెట్టుబడి ఖర్చులకు కూడా సరిపోవడం లేదని వారు పేర్కొన్నారు.(నిజాలు గణాంకాలు) మొక్కజొన్న గత ఏడాది క్వింటాలుకు రూ. 2,400 ఉండగా, ఈ ఏడాది కేవలం రూ. 10 మాత్రమే పెంచి రూ. 2,410గా నిర్ణయించడం అత్యంత విచారకరం.జొన్నలు గత ఏడాది రూ. 3,749 ఉండగా, ఈ ఏడాది రూ. 4,073గా నిర్ణయించారు (రూ. 324 పెంపు). అయితే ఆకాశాన్ని అంటుతున్న సాగు ఖర్చులతో పోలిస్తే ఈ పెంపు ఏమాత్రం గిట్టుబాటు కాదు.సాగు వ్యయం: ప్రస్తుతం ఒక ఎకరంలో వరి సాగుకు రూ. 30 వేలు, పత్తి సాగుకు రూ. 40 వేల వరకు పెట్టుబడి అవుతోంది. స్వామినాథన్ కమిషన్ (CACP) సిఫార్సుల ప్రకారం పెట్టుబడి ఖర్చుకు అదనంగా కనీసం 50 శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించాల్సి ఉండగా, ఆ నిబంధనలను తుంగలో తొక్కారు. రాష్ట్ర ప్రభుత్వానికి మా డిమాండ్లు:తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించాలి: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అరకొర మద్దతు ధరలపై ఆధారపడకుండా, రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక చొరవ తీసుకోవాలి.మొక్కజొన్న, జొన్నల కొనుగోలు కేంద్రాలు: రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులు పండించిన జొన్నలు, మొక్కజొన్న పంటలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలి.బోనస్ ధర ప్రకటించాలి: కేంద్రం ఇచ్చిన తక్కువ మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ అందించి రైతులను ఆదుకోవాలి. రైతులు ఆశించిన విధంగా జొన్నలకు, మొక్కజొన్నలకు లాభసాటి ధర దక్కేలా చూడాలి. అన్నదాత సుఖీభవ అనేది కేవలం నినాదంగా మిగిలిపోకూడదు. పెట్టుబడులు పెరిగి, అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. తెలంగాణ రక్షణ సేన ముస్లిం మైనార్టీ విభాగం ఎల్లప్పుడూ రైతు పక్షపాతిగా నిలుస్తుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి జొన్న,

మొక్కజొన్న రైతులను ఆదుకోకపోతే రైతాంగంతో కలిసి పెద్ద ఎత్తున నిరసనలు చేపడతాం.

## గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు హెచ్చరిక

హైదరాబాద్ మే 18 (వుదయం ప్రతినిధి ),

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) వార్డు రిజర్వేషన్ల వివరాలు ఉన్నాయని పేర్కొంటూ, "GHMC 2026 - 300 వార్డుల రిజర్వేషన్ల ప్రతిపాదిత జాబితా" అనే పేరుతో ఒక పత్రాన్ని కొన్ని వెబ్‌సైట్లు మరియు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ప్రచారం చేస్తున్నాయనే విషయం GHMC దృష్టికి వచ్చింది. ఈ విషయంలో, సదరు పత్రం/సమాచారం పూర్తిగా అనధికారికమైనది,

నకిలీదని GHMC స్పష్టం చేస్తోంది. GHMC అటువంటి రిజర్వేషన్ల జాబితాను గానీ లేదా సంబంధిత సమాచారాన్ని గానీ ఏ ప్రైవేట్ వ్యక్తికి, వెబ్‌సైట్‌కు, సంస్థకు లేదా మీడియా ప్లాట్‌ఫారమ్‌కు విడుదల చేయలేదు లేదా పంచుకోలేదు.

ప్రచారం చేయబడుతున్న ఈ సమాచారానికి GHMC లేదా ప్రభుత్వం యొక్క సమర్థ అధికారి నుండి ఎటువంటి ప్రామాణికత లేదా ఆమోదం లేదు. ధృవీకరించని ఇటువంటి కంటెంట్‌ను ప్రచురించడం మరియు వ్యాప్తి చేయడం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది మరియు అనవసరమైన గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఇటువంటి కల్పిత సమాచారాన్ని అనధికారికంగా ప్రచురించడాన్ని GHMC తీవ్రంగా ఖండిస్తోంది మరియు దానిని ప్రచురించి, ప్రచారం చేస్తున్న బాధ్యులైన వ్యక్తులు/సంస్థలపై తగిన చట్టపరమైన మరియు సైబర్‌క్రైమ్ చర్యలు తీసుకునే హక్కును కలిగి ఉంది. ఈ విషయమై అటువంటి వెబ్‌సైట్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయబడింది. పౌరులు, ప్రజా ప్రతినిధులు, మీడియా సంస్థలు మరియు సంబంధిత వర్గాల వారు ఇటువంటి నకిలీ మరియు అనధికారిక సమాచారంపై ఆధారపడవద్దని లేదా దానిని ప్రచారం చేయవద్దని సూచించడమైనది. జీహెచ్ఎంసీ (GHMC) విషయాలకు సంబంధించిన ఏదైనా అధికారిక సమాచారం అధీకృత ప్రభుత్వ/జీహెచ్ఎంసీ మార్గాల ద్వారా మాత్రమే తెలియజేయబడుతుంది.

## న్యూయార్క్‌లో ఆత్మీయ భేటీ

### న్యూయార్క్ నగరంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుతో గుబ్బుపు మచ్చేందర్ ఆత్మీయ భేటీ

నారాయణఖేడ్ ,మే 18(వుదయం)



అమెరికాలోని న్యూయార్క్ నగరంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తన్నీరు హరీష్ రావు ను జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు గుబ్బుపు మచ్చేందర్ సోమవారం ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా పలు ముఖ్య రాజకీయ, సామాజిక, ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్ర ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, గ్రామీణాభివృద్ధి, రైతుల సంక్షేమం, యువత భవిష్యత్తు, ముఖ్యంగా నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధిపై విస్తృతంగా అభిప్రాయాలు పంచుకున్నారు. నారాయణఖేడ్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలు, సాగునీటి కొరత, పాడైన రహదారులు, విద్యుత్ ఇబ్బందులు, రైతుల ఆర్థిక కష్టాలు, యువత నిరుద్యోగం, విద్యార్థుల భవిష్యత్తు, మహిళల భద్రత వంటి అనేక అంశాలను హరీష్ రావు దృష్టికి తీసుకువెళ్లారు.ఉపాధి కోసం హైదరాబాద్ మరియు ఇతర నగరాలకు వలస వెళ్తున్న యువత పరిస్థితులపై ప్రత్యేకంగా చర్చిస్తూ, నారాయణఖేడ్‌లోనే పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తే యువత జీవితాల్లో పెద్ద మార్పు వస్తుందని అభిప్రాయపడ్డారు. రైతులు ఎదుర్కొంటున్న పంటల నష్టాలు, ఎరువులు-విత్తనాల సమస్యలు, మార్కెట్ ఇబ్బందులు, భూగర్భ జలాల తగ్గుదల, విద్యుత్ సమస్యలపై కూడా లోతుగా చర్చించారు. ప్రతి గ్రామానికి మెరుగైన తాగునీటి వసతి, ఆరోగ్య సేవలు, విద్యా అవకాశాలు అందాల్సిన అవసరాన్ని వివరించారు. మహిళల భద్రత, యువతుల రక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, సాధికారతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మహిళలు భయంలేకుండా జీవించే సమాజ నిర్మాణం కోసం మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల పరిస్థితులు, నిరుద్యోగ యువత ఆవేదనలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్ ప్రభావం వంటి సామాజిక సమస్యలపై కూడా చర్చించారు. అమెరికాలోని తెలంగాణ ఎన్ఆర్ఐల పాత్ర, స్వదేశ అభివృద్ధికి వారు అందిస్తున్న సహాయం, ముఖ్యంగా నారాయణఖేడ్ అభివృద్ధికి ఎన్ఆర్ఐలు మరింతగా తోడ్పడాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఎన్ఆర్ఐలను ఒక వేదికపైకి తీసుకువచ్చి విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, యువత సాధికారత, మహిళల సంక్షేమం కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా ఎటిఏ, టిటిఏ, మాట వంటి తెలంగాణకు చెందిన ప్రముఖ ఎన్ఆర్ఐ సంఘాల ప్రతినిధులతో సమావేశమై తెలంగాణ అభివృద్ధి, రైతుల సంక్షేమం, విదేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజల ఐక్యతపై అభిప్రాయాలు పంచుకున్నారు. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ వింగ్ సభ్యులతో కలిసి పార్టీ భవిష్యత్ కార్యాచరణ, తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారం, నారాయణఖేడ్‌లో పార్టీని గ్రామస్థాయి వరకు మరింత బలోపేతం చేసే దిశగా చర్చలు జరిపారు.ఈ సమావేశంలో మహేష్ తన్నీరు, రామ్ లక్ష్మణ్ రెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ రెడ్డి, భాస్కర్, బుచ్చిబాబు, అరవింద్, వినయ్ తదితర తెలంగాణ ఎన్ఆర్ఐలు పాల్గొన్నారు.అనంతరం న్యూయార్క్ నగరంలోని బ్రాడ్‌వే వీధుల్లో కలిసి నడుస్తూ తెలంగాణ రాజకీయ పరిస్థితులు, నారాయణఖేడ్ ప్రజల ఆశలు, భవిష్యత్ నాయకత్వం మరియు సేవా కార్యక్రమాలపై ఆత్మీయంగా చర్చించారు. అనంతరం కలిసి డిన్నర్‌లో పాల్గొని పలు అంశాలపై స్నేహపూర్వకంగా మాట్లాడుకున్నారు.

## షాద్‌నగర్ కాంగ్రెస్‌లో కొత్త జోష్

నూతనంగా ఎన్నికైన అధ్యక్షులకు హృదయపూర్వక అభినందనలు!

షాద్‌నగర్ మే 18 (వుదయం ప్రతినిధి ),



షాద్‌నగర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు హృదయపూర్వక అభినందనలుతాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి కేశంపేట్ మాజీ జడ్పిటిసిపార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు, కాంగ్రెస్ సిద్ధాంతాల పరిరక్షణకు మీరు మరింత కృషి చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఆకాంక్షిస్తున్నాము. మీ నాయకత్వంలో పార్టీ మరింత బలపడాలని కోరుకుంటూమీ అందరికీ మరోసారి శుభాకాంక్షలు.

## ప్రజా సమస్యలపై తక్షణ స్పందన

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే18(వుదయం)



ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ చంద్రావతి తో కలిసి అదనపు కలెక్టరు (122) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మే 20న మెడికల్ షాపుల బంద్






- "మే 20 న ఆల్ ఇండియా మెడికల్ హాల్స్ బంద్, మండల తాసిల్దార్ మరియు స్టేషన్ ఎస్ హెచ్ ఓ కు వినతి పత్రం: మెడికల్ యూనియన్ ఆమనగల్,,

రంగారెడ్డి జిల్లా ( వుదయం ప్రతినిధి )

రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం లోని మే 20 న బుధవారం రోజున ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ బందుకు దేశవ్యాప్తంగాపిలుపునిచ్చిందని ఆమనగల్ మెడికల్ యూనియన్ మెంబర్స్ తెలిపారు, ఆన్లైన్లో మందులు అమ్మకాలను నిలిపివేయాలని అలాగే కార్పొరేట్ వ్యవస్థలు అధిక డిస్కౌంట్తో నకిలీ మందులు ఇవ్వడం నివారించాలని యూనియన్ సభ్యులు తెలిపారు, అలాగే దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవాళ్లు ముందే మెడిసిన్ సమకూర్చుకోవాలని వారు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా ఉండాలని ముందస్తు సమాచారం ఇస్తున్నామన్నారు, ప్రతిచోట ఎమర్జెన్సీకి హాస్పిటల్స్ ఉంటాయి ప్రజలు ఎవరు ఎక్కడఇబ్బందికిగురికాకూడదన్నారు, మే 20 న మెడికల్ బంద్కు అందరు సహకరించాలని కోరారు వినతి పత్రం ఇచ్చిన వారిలో నటరాజ్ యాదయ్య గుప్త, రవీంద్ర రవీంద్రనాథ్ గుప్త , లక్ష్మి మెడికల్ రాములు యాదవ్, శ్రీనివాస మెడికల్ శేఖర్, పద్మా మెడికల్ రాగయ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

- మొయినాబాద్ తహసీల్దార్‌కు లేబర్ సెల్ నాయకుల వినతి

మొయినాబాద్,మే18(వుదయం)




ప్రభుత్వ భూములు, ఇరిగేషన్ వాగులు మరియు అసైన్డ్ భూములను పరిరక్షిస్తూ అక్రమ వెంచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని చేవెళ్ల నియోజకవర్గం లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ మొయినాబాద్ తహసీల్దార్ గౌతం కుమార్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు.తోల్కట్ట గ్రామంలో ప్రభుత్వ భూములు, ఇరిగేషన్ వాగులకు సంబంధించిన భూముల్లో అసైన్డ్ రైతులను తొలగించి, అసైన్డ్ భూములను పట్టాలుగా మార్పు చేసి వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.ఇరిగేషన్ శాఖకు సంబంధించిన భూములకు హద్దులు నిర్ణయించి, అసైన్డ్ రైతుల భూములకు రక్షణ కల్పించాలని కోరారు.ప్రత్యేకంగా తోల్కట్ట గ్రామంలోని సర్వే నెంబర్ 124లో ఒక ఎకరం 20 గుంటల విస్తీర్ణంలో నూతనంగా వెంచర్ వేస్తున్న హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఈ అంశాలపై మొయినాబాద్ తహసీల్దార్ గౌతం కుమార్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు భానూరి శివశంకర్ గౌడ్ తెలిపారు.




"ఈ ప్రభుత్వం కోసం కేరళ ప్రజలు పోరాడారు. వారి గొంతుకే దీనికి మార్గదర్శనం చేస్తుంది. ప్రతి కేరళీయుడి గొంతుకగా నిలవనున్న విడి సతీశన్ జీకి, యావత్ మంత్రివర్గానికి హృదయపూర్వక అభినందనలు. ఈ ప్రచారాన్ని ముందుండి నడిపించిన కేసీ వేణుగోపాల్ కు ధన్యవాదాలు. ఈ ప్రచార సమయంలో అవిశ్రాంతంగా త్యాగాలు చేసిన ప్రతి యూడీఎఫ్ కార్యకర్త, డిజిటల్ యోధుడికి ఈ విజయం చెందుతుంది. అసలైన పని ఇప్పుడు మొదలవుతుంది."

**లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ**

## వే'మన'పద్యం

**ఉత్తముని కడుపున నోగు జన్మించిన**
**వాడె చెరచు వాని వంశమెల్ల**
**జెరకు వెన్నుపుట్టి చెరపదా తీసెల్ల**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# మారిన పరిస్థితుల్లో బంగ్లాతో...

భారత్ , బంగ్లాదేశ్ మధ్య కుదిరిన 30 ఏళ్ల నాటి గంగా జలాల పంపిణీ ఒప్పందం పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఎన్నికైన బీజేపీ ప్రభుత్వానికి మొదటి సవాలుగా నిలవనుంది. ఇది, డిసెంబర్ 2026లో పునరుద్ధరణకు రానుంది. సరిహద్దుకు ఇరువైపులా అత్యంత సున్నితమైన అంశమైన ఈ ఒప్పందం, ప్రధానమంత్రి తారిక్ రెహ్మాన్ నేతృత్వంలోని ఢాకాలోని కొత్త ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని న్యూఢిల్లీలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మధ్య ద్వైపాక్షిక సంబంధాలను పరీక్షకు పెట్టనుందని భావిస్తున్నారు. ఈ ఒప్పందం గడువు ముగియడానికి ఇంకా కొన్ని నెలల సమయం ఉండగానే, 30 ఏళ్ల నాటి ఈ ఒప్పందం స్థానంలో ఒక స్వల్పకాలిక ఒప్పందాన్ని కుదుర్చుకోవడంపై భారతదేశం ఇప్పటికే దృష్టి సారించింది. మరోవైపు బంగ్లాదేశ్, ప్రస్తుత పరిస్థితుల్లో, పర్యావరణపరంగానూ, రాజకీయంగానూ ఢాకాకు మరింత ప్రయోజనకరంగా ఉండే నిబంధనల ఆధారంగా ఈ ఒప్పందాన్ని తిరిగి చర్చించడానికి సన్నద్ధమవుతోంది. గతంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం సంతకం చేయడానికి సిద్ధంగా ఉన్న, వివాదాస్పదమైన తీస్తా జలాల పంపిణీ ఒప్పందాన్ని, మమతా బెనర్జీ నేతృత్వంలోని నాటి బెంగాల్ ప్రభుత్వం వ్యతిరేకించింది. ఉత్తర బెంగాల్‌లో తగినంత నీరు లేదని, బంగ్లాదేశ్‌తో తీస్తా జలాలను వివేకంతో పంచుకోకపోతే ఆ ప్రాంతం ఎండిపోతుందని బెంగాల్ వాదించింది. ఆ సమయంలో, రాష్ట్ర బీజేపీ కూడా ఇదే కారణంతో ఆ ప్రతిపాదనను వ్యతిరేకించింది. రాష్ట్రంలో తన ఆధారాన్ని ఏర్పరచుకున్నప్పటి నుండి ఉత్తర బెంగాల్ బీజేపీకి ఒక బలమైన కోటగా ఉంది. ఇది, ఆ ఒప్పందాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఒక అడ్డంకిగా మారింది. బెంగాల్‌లోని మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, దక్షిణ బెంగాల్ ప్రజలపై ప్రభావం చూపగల చర్య అయిన బంగ్లాదేశ్‌తో గంగా జలాలను పంచుకోవడానికి ముఖ్యమంత్రి సువేందు అధికారి అంగీకరిస్తారా, అలాగే పెండింగ్‌లో ఉన్న తీస్తా జలాల పంపిణీ ఒప్పందంతో ముందుకు సాగుతారా అనేది గమనించవలసిన విషయం. నీటి పంపిణీ ఒప్పందం పట్ల మమతా బెనర్జీ ప్రభుత్వ వైఖరి, కేంద్ర ప్రభుత్వానికి ఒక రక్షణ కవచంలా పనిచేసింది. ఇప్పుడు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, గంగా నీటి ఒప్పందాన్ని పునరుద్ధరించాలా వద్దా, అలాగే ఢాకా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తీస్తా నీటి పంపిణీ ఒప్పందాన్ని తిరిగి ప్రారంభించాలా వద్దా అనే విషయాలపై ఎన్‌డిఎ ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ విషయాలపై ఢాకా నుండి వస్తున్న సంకేతాలు స్పష్టంగా ఉన్నాయి. బెంగాల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే, అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, తీస్తా నీటి పంపిణీ ఒప్పందాన్ని అడ్డుకుంటున్నందుకు మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. అదే సమయంలో, బెంగాల్‌లో విజయం సాధించినందుకు బీజేపీకి అభినందనలు తెలుపుతూ, ఈ ఫలితం రాష్ట్రానికి, బంగ్లాదేశ్‌కు మధ్య సంబంధాలను కొనసాగించడానికి, బలోపేతం చేయడానికి సహాయపడుతుందని అభివర్ణించింది. సరిహద్దులో భద్రతాపరమైన సమస్యలు తీవ్రమవడంతో, బంగ్లాదేశ్ నుండి చొరబాట్లు మరియు అక్రమ వలసలను బీజేపీ తన ప్రధాన అంశాలలో ఒకటిగా మలచుకోవడంతో, ఇరు దేశాల మధ్య సంబంధాలు ఇప్పటికే వివాదాస్పద మలుపు తిరుగుతున్నాయి.
సరిహద్దుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు అత్యంత కీలకమైన నీటి పంపిణీ సమస్యల విషయంలో బీజేపీ ఏ వైఖరి అవలంబిస్తుందో వేచి చూడాలి. బంగ్లాదేశ్‌తో నదీ జలాల పంపిణీ దిశగా బీజేపీ ముందడుగు వేయదలిస్తే, ఆ చర్య వల్ల క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు కోల్పోకుండా ఉండేలా అది జాగ్రత్తపడాలి.
బంగ్లాదేశ్‌తో నీటి పంపకాలకు సంబంధించిన చివరి ఒప్పందాలు, ప్రధాని మోడీ, నాటి ప్రధాని షేక్ హసీనా మధ్య, సెప్టెంబర్ 6, 2022న న్యూఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక సమావేశం సందర్భంగా కుదిరాయి. అస్సాంపై ప్రభావం చూపే కుషియారా నదీ జలాలను పంచుకోవడంపై ఇరు దేశాలు ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. అలాగే, రెండు దేశాలు పంచుకుంటున్న 54 నదులపై కలిసి పనిచేయడానికి సంయుక్తంగా ప్రతిజ్ఞ చేశాయి. అయినప్పటికీ, గంగా, తీస్తా జలాల పంపకం ఒప్పందాలు పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ ప్రజల మధ్య అత్యంత సున్నితమైన అంశాలుగా మిగిలిపోయాయి. రాజ్యాంగం ప్రకారం, నీరు ఒక రాష్ట్ర అంశం కావడం వల్ల, రాష్ట్ర అభ్యంతరాలను అధిగమించడం గతంలో కేంద్ర ప్రభుత్వానికి సాధ్యపడలేదు. తద్వారా ఆ ఒప్పందం పెండింగ్‌లో ఉండిపోయింది. ప్రస్తుతం డబుల్ ఇంజన్ సర్కారు ఉన్నందున సువేందు అధికారి ఆచితూచి అడుగులు వేయక తప్పదు.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# పెరియార్ వారసత్వం.. విజయ్ వ్యూహం

దక్షిణ భారత రాజకీయ యవనికపై తమిళనాడు ఒక ప్రత్యేకమైన, చైతన్యవంతమైన ప్రయోగశాలగా భాసిల్లుతోంది. సామాజిక న్యాయం, భాషాభిమానం, ఆత్మగౌరవ పోరాటాలు కలగలిసిన ఈ రాష్ట్ర రాజకీయ ప్రస్థానం భారత ప్రజాస్వామ్యానికే ఒక దిక్సూచి. 1952లో ప్రారంభమైన తొలి ఎన్నికల నుంచి నేటి వరకు ఈ గడ్డపై జరిగిన రాజకీయ మార్పులు కేవలం అధికార మార్పిడికి పరిమితం కాకుండా, ఒక సామాజిక విప్లవంగా సాగాయి. తొలినాళ్లలో జాతీయ పార్టీల ఆధిపత్యం నుంచి ప్రాంతీయ పార్టీల ఏకఛత్రాధిపత్యం వరకు, ఇప్పుడు సినీ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం (టి వి కె) ద్వారా ఒక బలమైన మూడవ శక్తి ఆవిర్భావం వరకు తమిళనాడు రాజకీయ చరిత్ర ఒక అద్భుతమైన మలుపుల సమాహారం. ఈ పరిణామాలను విశ్లేషిస్తే, ఇక్కడి రాజకీయాలు కేవలం ఎన్నికల చుట్టూ కాకుండా సామాజిక-సాంస్కృతిక పునాదులపై నిర్మితమయ్యాయని స్పష్టమవుతుంది. స్వాతంత్ర్యానంతర తొలి దశాబ్దాల్లో తమిళనాడు (అప్పటి మద్రాస్ రాష్ట్రం) రాజకీయాలు భారత జాతీయ కాంగ్రెస్ అదుపులో ఉండేవి. చక్రవర్తి రాజగోపాలాచారి (రాజాజీ), కె. కామరాజ్ వంటి ఉద్దండుల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 1952, 1957, 1962 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించింది. ముఖ్యంగా కామరాజ్ హయాంలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు, మధ్యాహ్న భోజన పథకం వంటి సంస్కరణలు వచ్చాయి. అయితే, అప్పటికే తెరవెనుక ఒక సామాజిక నిరసన జ్వాల రగులుతోంది. ఈ.వి.రామస్వామి నాయక్కర్ (పెరియార్) ప్రారంభించిన 'ఆత్మగౌరవ ఉద్యమం' బ్రాహ్మణేతర వర్గాల్లో చైతన్యాన్ని రగిల్చింది. 1944లో జస్టిస్ పార్టీని 'ద్రావిడర్ కజగం' (డి కె)గా మార్చిన పెరియార్, ద్రావిడ అస్తిత్వాన్ని, హిందీ వ్యతిరేకతను ఒక ప్రధాన అజెండాగా మార్చారు. రాజకీయాల్లోకి రాకుండా సామాజిక మార్పు కోసమే పనిచేస్తానని పెరియార్ ప్రకటించినప్పటికీ, ఆయన శిష్యుడు సి.ఎన్. అన్నాదురై మాత్రం ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారాన్ని చేపట్టి సిద్ధాంతాలను అమలు చేయాలని భావించారు. ఈ భావజాల ఘర్షణ ఫలితంగానే 1949లో ద్రావిడ మున్నేట్ర కజగం (డి ఎం కె) ఆవిర్భవించింది.
1967 ఎన్నికలు తమిళనాడు చరిత్రలో ఒక వాటర్ షెడ్ మూమెంట్. హిందీ వ్యతిరేక ఉద్యమాలు, భాషా స్ఫూర్తిని రగిలించిన అన్నాదురై నేతృత్వంలోని డి ఎం కె, కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టి అధికారాన్ని దక్కించుకుంది. స్వతంత్ర భారత చరిత్రలో ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ పార్టీని ఓడించి స్పష్టమైన మెజారిటీ సాధించడం ఇదే ప్రథమం. అన్నాదురై ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, రాష్ట్రానికి 'తమిళనాడు' అని పేరు పెట్టడం, ద్విభాషా సూత్రాన్ని అమలు చేయడం వంటి నిర్ణయాలు ద్రావిడ రాజకీయాలకు గట్టి పునాది వేశాయి. అయితే, 1969లో ఆయన అకాల మరణం తర్వాత ఎం. కరుణానిధి పార్టీ బాధ్యతలు చేపట్టి, ద్రావిడ సిద్ధాంతాన్ని పరిపాలనతో మేళవించారు. ఈ క్రమంలోనే సినీ రంగానికి, రాజకీయాలకు మధ్య ఉన్న అవినాభావ సంబంధం మరింత బలపడింది. ఎం.జి. రామచంద్రన్ (ఎం జి ఆర్) అద్భుతమైన సినీ వ్యక్తిత్వం డి ఎం కె కు వెన్నెముకగా నిలిచింది. కానీ, కరుణానిధితో విభేదాల కారణంగా 1972లో ఎం జి ఆర్ బయటకు వచ్చి 'అన్నా ద్రావిడ మున్నేట్ర కజగం' (ఏ ఐ ఎ డీఎంకే)ను స్థాపించారు.
ఎం జి ఆర్ స్థాపించిన ఆల్ ఇండియా అన్నా డి ఎం కె రాజకీయాల్లో ఒక కొత్త ఒరవడిని సృష్టించింది. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన అగ్రగామిగా నిలిచారు. 1977 నుంచి 1987లో ఆయన మరణించే వరకు తమిళనాడులో ఎం జి ఆర్ ప్రభంజనం కొనసాగింది. ఆయన మరణానంతరం జయలలిత పార్టీ పగ్గాలు చేపట్టి, 'అమ్మ'గా నీరాజనాలు అందుకున్నారు. దశాబ్దాల పాటు తమిళనాడు రాజకీయాలు కరుణానిధి, జయలలిత అనే ఇద్దరు దిగ్గజాల చుట్టూనే తిరిగాయి. ఒకసారి డి ఎం కె, మరోసారి ఏ ఐ ఏ డి ఎం కె అన్నట్లుగా సాగిన ఈ ద్వైపాక్షిక ఆధిపత్యం రాష్ట్రంలో మూడవ శక్తికి తావు లేకుండా చేసింది. కానీ, 2016లో జయలలిత, 2018లో కరుణానిధి మరణం తర్వాత రాష్ట్రంలో ఒక రకమైన నాయకత్వ శూన్యత ఏర్పడింది. స్టాలిన్ డి ఎం కె పార్టీని సమర్థంగా నడిపిస్తున్నప్పటికీ, ఏ ఐ ఏ డి ఎం కె లో చీలికలు, అంతర్గత కలహాలు సంప్రదాయ ఓటర్లను ప్రత్యామ్నాయం వైపు చూసేలా చేశాయి. ఇదే తరుణంలో కమల్ హాసన్ వంటి వారు ప్రయత్నించినా, ప్రజలు ఒక బలమైన, సుదీర్ఘ కాలం నిలబడే శక్తి కోసం నిరీక్షించారు.



సినీ నటుడు విజయ్ రాజకీయ రంగప్రవేశం ఒక సంచలనంగా మారింది. తమిళనాడులో 'తళపతి'గా కోట్లాదిమంది అభిమానాన్ని చూరగొన్న విజయ్, 'తమిళగ వెట్రి కజగం' (టి వి కె) అనే పార్టీని స్థాపించి, మొదటి నుంచీ చాలా స్పష్టమైన వైఖరిని అవలంబించారు. ఆయన రాజకీయ ప్రవేశం కేవలం సినిమాల నుంచి వచ్చిన క్రేజ్ మీద మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో ఉన్న అభిమాన సంఘాల (విజయ్ మక్కల్ ఇయక్కం) పటిష్టమైన యంత్రాంగంపై ఆధారపడి జరిగింది. విజయ్ తన తొలి బహిరంగ సభలోనే తన భావజాలాన్ని స్పష్టం చేశారు. పెరియార్ చూపిన సామాజిక న్యాయం, అన్నాదురై చెప్పిన ప్రాంతీయ స్వయంప్రతిపత్తి, అవినీతి రహిత పాలనను తన లక్ష్యాలుగా ప్రకటించారు. ఎటువంటి కూటములకు తలొగ్గకుండా, స్వతంత్రంగా పోటీ చేయాలనే ఆయన నిర్ణయం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది.

ఈ చారిత్రక నేపథ్యంలోనే సినీ నటుడు విజయ్ రాజకీయ రంగప్రవేశం ఒక సంచలనంగా మారింది. తమిళనాడులో 'తళపతి'గా కోట్లాదిమంది అభిమానాన్ని చూరగొన్న విజయ్, 'తమిళగ వెట్రి కజగం' (టి వి కె) అనే పార్టీని స్థాపించి, మొదటి నుంచీ చాలా స్పష్టమైన వైఖరిని అవలంబించారు. ఆయన రాజకీయ ప్రవేశం కేవలం సినిమాల నుంచి వచ్చిన క్రేజ్ మీద మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో ఉన్న అభిమాన సంఘాల (విజయ్ మక్కల్ ఇయక్కం) పటిష్టమైన యంత్రాంగంపై ఆధారపడి జరిగింది. విజయ్ తన తొలి బహిరంగ సభలోనే తన భావజాలాన్ని స్పష్టం చేశారు. పెరియార్ చూపిన సామాజిక న్యాయం, అన్నాదురై చెప్పిన ప్రాంతీయ స్వయంప్రతిపత్తి, మరియు అవినీతి రహిత పాలనను తన లక్ష్యాలుగా ప్రకటించారు. ఎటువంటి కూటములకు తలొగ్గకుండా, స్వతంత్రంగా పోటీ చేయాలనే ఆయన నిర్ణయం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది.


తాజా ఎన్నికల ఫలితాలు గమనిస్తే, తమిళనాడు ఓటర్లు మార్పును కోరుకుంటున్నారని స్పష్టంగా అర్థమవుతోంది. 234 స్థానాలున్న అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ 118 కాగా, విజయ్ నేతృత్వంలోని టి వి కె ఏకంగా 108 స్థానాలను కైవసం చేసుకోవడం ఒక అసాధారణ పరిణామం. ఆరు దశాబ్దాల ద్రావిడ పార్టీల ఆధిపత్యానికి ఇది గట్టి హెచ్చరిక. 118 స్థానాలకు కేవలం పది స్థానాల దూరంలో నిలబడటం అంటే, తమిళ ప్రజలు ఆయన నాయకత్వంపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనం. ఈ విజయానికి ప్రధాన కారణం యువత. తమిళనాడులోని 18-35 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లలో అత్యధిక శాతం విజయ్ వైపు మొగ్గు చూపారు. నిరుద్యోగం, విద్యా రంగంలో సంస్కరణలు, మరియు పారదర్శకమైన పాలనపై ఆయన ఇచ్చిన హామీలు యువతను కదిలించాయి. అలాగే, సోషల్ మీడియాను ప్రచార అస్త్రంగా వాడుకోవడంలో ఆయన పార్టీ అత్యంత నైపుణ్యాన్ని ప్రదర్శించింది. మరోవైపు, సంప్రదాయ పార్టీలైన డి ఎం కె, ఏ ఐ ఏ డి ఎం కె లు తమ ఓటు బ్యాంకును కాపాడు కోవడంలో కొంత తడబడ్డాయి. అధికార పార్టీపై ఉన్న వ్యతిరేక, ప్రతిపక్ష పార్టీలో ఉన్న నాయకత్వ లోపం విజయ్‌కు సానుకూలంగా మారాయి. విజయ్ తన ప్రసంగాల్లో ద్రావిడ సిద్ధాంతాన్ని గౌరవిస్తూనే, ఆ సిద్ధాంతం పేరుతో జరుగుతున్న కుటుంబ పాలనను, అవినీతిని ఎండగట్టడం సామాన్య ప్రజలను ఆకట్టుకుంది. ద్రావిడ భావజాలం అంటే కేవలం రాజకీయ అధికారం కాదని, అది ప్రజల జీవన ప్రమాణాలను పెంచే సాధనమని ఆయన చేసిన వాదన కొత్త చర్చకు దారితీసింది. అయితే, 108 స్థానాల వద్ద ఆగిపోవడంతో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం కోసం ఆయన ఇతర చిన్న పార్టీల మీద లేదా స్వతంత్రుల మీద ఆధారపడాల్సి ఉంటుంది. ఇది ఆయనకు రాజకీయ పరిణతిని పరీక్షించే సమయం. భవిష్యత్తు సవాళ్లను పరిశీలిస్తే, కేవలం సినిమాల ద్వారా వచ్చిన ఇమేజ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలం మనుగడ సాగించడానికి సరిపోదు. ఎంజీఆర్, జయలలిత వంటి వారు తమ పరిపాలనా దక్షతతో ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. విజయ్ కూడా ఇప్పుడు తన పార్టీని ఒక పటిష్టమైన రాజకీయ వ్యవస్థగా మార్చాల్సి ఉంది. శాసనసభలో 108 మంది సభ్యులను సమన్వయం చేసుకుంటూ, ప్రజా సమస్యలపై పోరాడటం ఆయన ముందున్న తక్షణ కర్తవ్యం. ఒకవేళ సంకీర్ణ ప్రభుత్వం వైపు వెళ్లాల్సి వస్తే, తన సొంత సిద్ధాంతాలను పక్కన పెట్టకుండా పాలన సాగించడం ఒక కత్తి మీద సాము వంటిదే. తమిళనాడు ప్రజలు చాలా విజ్ఞత కలిగిన వారు. వారు మార్పును ఆహ్వానించారు, కానీ ఆ మార్పు నిలకడగా ఉండాలని కోరుకుంటారు.
చివరగా...తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక సుదీర్ఘమైన వృత్తం పూర్తయి కొత్త వృత్తం మొదలైంది. కాంగ్రెస్ నుంచి ద్రావిడ పార్టీలకు, ద్రావిడ పార్టీల అంతర్గత పోటీ నుంచి ఇప్పుడు ఒక సరికొత్త నాయకత్వానికి అధికారం చేరడం ప్రజాస్వామ్య బలాన్ని సూచిస్తుంది. విజయ్ సాధించిన ఈ విజయం కేవలం ఒక వ్యక్తి గెలుపు కాదు, అది తమిళ సమాజంలో గూడుకట్టుకున్న మార్పు ఆకాంక్షకు ప్రతిరూపం. 108 స్థానాల గెలుపుతో ఆయన రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని 'కింగ్ మేకర్' లేదా 'కింగ్'గా అవతరించారు. ఈ కొత్త అధ్యాయం తమిళనాడును అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తుందా లేదా రాజకీయ అస్థిరతకు దారితీస్తుందా అనేది కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా, ద్రావిడ గడ్డపై మరోసారి ఒక వెండితెర సూర్యుడు రాజకీయ దిక్సూచిగా మారడం తమిళనాడు ప్రత్యేకతను మరోసారి చాటిచెప్పింది.



సంగనబట్ల
9440595494

## మనసు పలికిన నిశ్శబ్దం

మనసంటే
మాటల్లో చెప్పలేని మౌనం...!
కళ్లలో దాచుకున్న
వేల కథల గానం...!!
నవ్వుతూ కనిపించినా
లోపల తుఫానై ఉండేది..!
అందరితో కలిసిపోయినా
ఒంటరితనమే
మిగిలేది...!!
అది ఆడమనసైతే
ఇంకా లోతైన
సముద్రం...!



ప్రేమిస్తే ప్రాణమంతా ఇస్తుంది
బాధిస్తే నిశ్శబ్దమై పోతుంది...!!
అమ్మగా మారితే
అంతులేని త్యాగం
భార్యగా నిలిస్తే
ఇంటికే దీపస్తంభం...!!
కూతురై నవ్వితే
ఇల్లంతా వసంతం
చెల్లెలై పలికితే
మనసంతా ఆనందం...!!
కన్నీళ్లు దాచుకుని
కలలను మోసే హృదయం
అదే ఆడమనసు...
అర్థం చేసుకున్నవారికే
అది ఒక అందమైన కావ్యం...
!!



డా. పూసపాటి వేదాద్రి
9912197694

# విప్లవం నుంచి విద్యా విప్లవం వరకు

**సంకల్పం ఉంటే ఎప్పుడైనా నేర్చుకోవచ్చు, మారవచ్చు, సమాజానికి ఉపయోగపడవచ్చు. ఇది మావోయిజం అనుసరించిన వారికి మాత్రమే కాదు, అన్ని రకాల ఉద్యమకారులకు, యువతకు ఒక సందేశం. దేవ్ జీ తెలుగు పరీక్ష రాయడం కూడా సామాన్యం కాదు. ఒకప్పుడు విప్లవ నినాదాలు ఇచ్చిన నోటి నుంచి ఇప్పుడు తన మాతృభాష పట్ల గౌరవం, జ్ఞానం కోసం కృషి కనిపిస్తోంది. ఇది సంస్కృతి, భాష, విద్య ద్వారా సమాజాన్ని మార్చాలనే లోతైన అవగాహనను చూపిస్తోంది. ఇక్కడ మరో ముఖ్యమైన ప్రశ్న కూడా సమాజం ముందుకు వస్తోంది. ఒకప్పుడు తుపాకీ పట్టిన వ్యక్తి ఇప్పుడు పుస్తకం పట్టినప్పుడు, మనం అతడిని అనుమానంతో చూడాలా? లేక మార్పును స్వాగతించాలా? ప్రజాస్వామ్యం అంటే మార్పుకు అవకాశం ఇవ్వడం. సమాజం తన విభేదాలను చర్చలతో, చట్టబద్ధ మార్గాలతో పరిష్కరించుకోవడం.**

ఒక సమాజం ఎదుగుదలని కొలవాలంటే కేవలం ఆర్థిక ప్రగతిని కాదు, ఆ సమాజం తన తప్పులను ఎంత లోతుగా అర్థం చేసుకుని మార్పు వైపు అడుగులు వేస్తుందో చూడాలి. ఒకప్పుడు తుపాకీనే సమాధానమని నమ్మిన వ్యక్తి, ఈరోజు పుస్తకాన్ని చేతబట్టడం అది కేవలం వ్యక్తిగత పరిణామం కాదు, ఒక చారిత్రక సంకేతం. అడవుల్లో గన్ మోగించిన చేతులు ఇప్పుడు పెన్ను పట్టుకోవడం అంటే చరిత్రలోనే గొప్ప మార్పు. మాజీ మావోయిస్టు అగ్రనేత కామ్రేడ్ తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష రాయడం ఒక చిన్న వార్తలా కనిపించవచ్చు. కానీ దాని వెనుక దాగి ఉన్న సందేశం ఎంతో గొప్పది. సమాజాన్ని హింసతో మార్చలేమని, శాశ్వత మార్పు విద్య ద్వారానే సాధ్యమని కాలం నేర్పిన పాఠానికి ఇది జీవించిన ఉదాహరణ. ఒకప్పుడు అడవుల్లో తుపాకీ పట్టుకొని విప్లవం ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందని నమ్మిన వ్యక్తి, నలభై రెండేళ్ల తర్వాత పరీక్షా హాల్లో పెన్ను పట్టుకొని కూర్చోవడం.. ఇది సాధారణ వ్యక్తిగత కథ కాదు. ఇది ఒక రాజకీయ భావజాలం యొక్క గొప్ప మార్పును, హింసాత్మక విప్లవం నుంచి జ్ఞానాత్మక విప్లవం వైపు తీసుకెళ్తున్న చారిత్రక మలుపును సూచిస్తుంది. జగిత్యాల జిల్లా కోరుట్లలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష రాసిన మాజీ మావోయిస్టు అగ్రనేత కామ్రేడ్ తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ కథ ఈ సందేశాన్ని బలంగా చెబుతోంది. 1982లో ఇంటర్ చదువుతూ తెలుగు పరీక్ష తప్పిపోయిన యువకుడు తిరుపతి, సమాజంలోని భూస్వామ్య



దౌర్జన్యాలు, పేదరికం, అసమానతలు చూసి విప్లవ బాట పట్టాడు. దశాబ్దాల పాటు అడవుల్లో, ప్రజా పోరాటాల్లో "దేవ్ జీ"గా కీలక నాయకుడిగా పనిచేశాడు. కానీ కాలం మారింది. ప్రపంచం మారింది. తెలంగాణ సమాజం మారింది. ఆ మార్పును గుర్తించి, దేవ్ జీ తన జీవితంలోని అసంపూర్తిని పూర్తి చేయడానికి మళ్లీ విద్యార్థిగా మారారు. ఇది వ్యక్తిగత సంకల్పం మాత్రమే కాదు.. మావోయిజం ఒక ముఖ్యమైన ఆత్మపరిశీలనకు, పరిణామానికి గురైందనడానికి సజీవ సాక్ష్యం. మావోయిజం ఒక కాలంలో హింసాత్మక సాయుధ పోరాటాన్ని ప్రధాన ఆయుధంగా చేసుకొని సమాజ మార్పును ఆశించింది. ఆ కాలంలో గ్రామీణ తెలంగాణలో ఉన్న తీవ్రమైన అన్యాయాలు ఆ మార్గాన్ని అనివార్యంగా చేశాయి. కానీ ఈరోజు దేవ్ జీ చేస్తున్న ప్రయాణం స్పష్టంగా చెబుతోంది, తుపాకీ ద్వారా సాధించలేని మార్పును విద్య, జ్ఞానం, చట్టపరమైన పోరాటం ద్వారా సాధించవచ్చు. ఆయన "ఇంటర్ పూర్తి చేసి న్యాయ విద్య అభ్యసించి పేదలకు న్యాయ సహాయం అందించాలని" అన్న మాటలు ఈ మార్పును బలంగా ప్రతిబింబిస్తాయి. విద్య ఒక వ్యక్తిని మాత్రమే మార్చదు.. సమాజాన్ని పునర్నిర్మించగల శక్తి. ఇది హింసకు ప్రత్యామ్నాయం. ఇది దీర్ఘకాలిక, స్థిరమైన మార్పును తెచ్చిపెడుతుంది. దేవ్ జీ వంటి వ్యక్తులు విద్య వైపు మొగ్గుచూపడం ద్వారా, మావోయిస్టు ఉద్యమం లోపలి నుంచే ఒక కొత్త చైతన్యం, ఒక వాస్తవిక పరిణామం జరుగుతున్నట్లు సూచిస్తోంది. సాయుధ పోరాటం ఒక దశ అయితే, విద్యావంతులైన, చట్టబద్ధమైన, సామాజిక చైతన్యం కలిగిన పోరాటం మరొక ఉన్నత దశ. ఈ మార్పు గుర్తించడం సమాజం యొక్క బాధ్యత. ఈ రోజుల్లో చాలా మంది యువకులు చిన్న అపజయాలకు విరామం ఇచ్చి చదువు, లక్ష్యాలు వదిలేస్తున్నారు. అటువంటి వారికి దేవ్ జీ జీవితం ఒక గుణపాఠం. వయసు 42 ఏళ్లు పైబడినా, పరిస్థితులు ఎంత మారినా.. సంకల్పం ఉంటే ఎప్పుడైనా నేర్చుకోవచ్చు, మారవచ్చు, సమాజానికి ఉపయోగపడవచ్చు. ఇది మావోయిజం అనుసరించిన వారికి మాత్రమే కాదు, అన్ని రకాల ఉద్యమకారులకు, యువతకు ఒక సందేశం. దేవ్ జీ తెలుగు పరీక్ష రాయడం కూడా సామాన్యం కాదు. ఒకప్పుడు విప్లవ నినాదాలు ఇచ్చిన నోటి నుంచి ఇప్పుడు తన మాతృభాష పట్ల గౌరవం, జ్ఞానం కోసం కృషి కనిపిస్తోంది. ఇది సంస్కృతి, భాష, విద్య ద్వారా సమాజాన్ని మార్చాలనే లోతైన అవగాహనను చూపిస్తోంది. ఇక్కడ మరో ముఖ్యమైన ప్రశ్న కూడా సమాజం ముందుకు వస్తోంది. ఒకప్పుడు తుపాకీ పట్టిన వ్యక్తి ఇప్పుడు పుస్తకం పట్టినప్పుడు, మనం అతడిని అనుమానంతో చూడాలా? లేక మార్పును స్వాగతించాలా? ప్రజాస్వామ్యం అంటే మార్పుకు అవకాశం ఇవ్వడం. సమాజం తన విభేదాలను చర్చలతో, చట్టబద్ధ మార్గాలతో పరిష్కరించుకోవడం. అలాంటి సమయంలో దేవ్ జీ లాంటి వ్యక్తుల పరిణామాన్ని అర్థం చేసుకోవడం ఎంతో అవసరం. ఎందుకంటే ఒక వ్యక్తి హింసను వదిలి విద్య వైపు మళ్లడం అంటే అది సమాజానికి లాభమే గాని నష్టం కాదు. నిజానికి, ఇది కేవలం దేవ్ జీ కథ మాత్రమే కాదు. ఇది తెలంగాణ చరిత్రలో జరిగిన ఒక భావజాల పరిణామం. ఒకప్పుడు అన్యాయాలకు ప్రతిస్పందనగా పుట్టిన సాయుధ ఉద్యమాలు, ఇప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థలోనే మార్పు సాధ్యమని అంగీకరిస్తున్న దశకు చేరుకోవడం చారిత్రక అవసరం. కాలం మారినప్పుడు భావజాలాలు కూడా మారాలి. మార్పును అంగీకరించని సిద్ధాంతం చివరికి సమాజం నుంచి దూరమవుతుంది. ముగింపుగా, దేవ్ జీ కథ మనకు ఒక గొప్ప సత్యాన్ని గుర్తు చేస్తోంది. నిజమైన విప్లవం తుపాకీ శబ్దంలో కాదు, పుస్తకం పేజీల్లో ఉంటుంది. హింస తాత్కాలిక భయాన్ని మాత్రమే సృష్టిస్తుంది. కానీ విద్య శాశ్వతమైన చైతన్యాన్ని కలిగిస్తుంది. సమాజాన్ని కూల్చడం కంటే నిర్మించడం గొప్పది. ద్వేషాన్ని పెంచడం కంటే అవగాహన పెంచడం విలువైనది.
దేవ్ జీ పరీక్ష రాయడం ఒక సాధారణ విద్యార్థి విజయం కాదు. అది ఒక భావజాలం తనను తాను పునఃపరిశీలించుకున్న చారిత్రక క్షణం. ఒకప్పుడు అడవుల్లో మార్పు కోసం వెతికిన వ్యక్తి, ఇప్పుడు పుస్తకాలలో సమాధానం వెతుకుతున్నాడు. ఇదే నిజమైన పరిణామం. ఇదే నాగరిక సమాజం ముందుకు వెళ్లే దారి. దేవ్ జీ గెలుపు కేవలం ఒక పరీక్షలో కాదు.. హింసాత్మక విప్లవ భావన నుంచి జ్ఞాన విప్లవ భావన వైపు తీసుకెళ్తున్న ఆలోచనాపరమైన విజయం. ఈ విజయం సమాజం మొత్తం ఆలోచించాల్సిన విజయం.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్
9010128884

# జాతీయం-అంతర్జాతీయం

## వియత్నాం, దక్షిణ కొరియాకు రక్షణ మంత్రి పర్యటన

వుదయం డెస్క్, మే 18ః రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 2026 మే 18, 19 తేదీల్లో వియత్నాంలోనూ, 2026 మే 19 నుంచి 21 వరకు రిపబ్లిక్ ఆఫ్ కొరియాలోనూ పర్యటిస్తారు. ఈ పర్యటనకు బయలుదేరే ముందు సామాజిక మాధ్యమం ఎక్స్‌పై చేసిన పోస్టులో ఈ రెండు దేశాల్లోనూ చేపట్టే పర్యటన ద్వైపాక్షిక సంబంధాల పరిధిని మరింత విస్తరింపచేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వ్యూహాత్మక సైనిక సహకారాన్నీ రక్షణ పారిశ్రామిక భాగస్వామ్యాలనూ బలోపేతం చేసుకోవడం, నౌకా వాణిజ్య సహకారాన్ని ప్రోత్సహించడం, ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతినీ, స్థిరత్వాన్నీ పెంపొందిచడంపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. వియత్నాంలో రక్షణ మంత్రి పర్యటన రెండు దేశాల మధ్య ఏర్పడిన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి పదేళ్లు పూర్తయిన సందర్భాన్ని సూచిస్తుంది. ఈ భాగస్వామ్యాన్ని 2026 మే 5 నుంచి 7 వరకు భారత్‌లో వియత్నాం అధ్యక్షుడు పర్యటించిన సందర్భంలో విస్తరించిన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా మెరుగుపరిచారు. ఈ పర్యటనలో భాగంగా వియత్నాం రక్షణ మంత్రి జనరల్ ఫాన్ వాన్ జియాంగ్‌తో రాజనాథ్ సింగ్ ద్వైపాక్షిక చర్చలు చేపడతారు. 2022 జూన్ 8 నుంచి 10 వరకు రక్షణ మంత్రి వియత్నాంలో పర్యటించిన సమయంలో 2030 నాటికి భారత్‌వియత్నాం రక్షణ భాగస్వామ్య సంయుక్త ప్రకటనపై సంతకాలు చేశారు. ద్వైపాక్షిక రక్షణ సహకారానికి నిర్దిష్టమైన మార్గాన్ని ఈ దార్శనిక పత్రం అందిస్తుంది. ఈ ప్రాంతంలో శాంతి, సంక్షేమం విషయంలో రెండు దేశాలకు ఉమ్మడి ఆసక్తి ఉంది.

వియత్నాంలో రాజ్‌నాథ్ సింగ్ పర్యటించే సమయంలోనే.. 2026 మే 19న ఆ దేశ మాజీ అధ్యక్షుడు హో చి మిన్ 136వ జయంతిని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా హో చి మిన్ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి రక్షణ మంత్రి నివాళి అర్పిస్తారు.

## ఇంధన కొరత లేదు, సరఫరా సంక్షోభం లేదు: ప్రభుత్వం

**భారత్ వద్ద తగినంత ముడి చమురు, ఎల్‌పిజి, గ్యాస్ నిల్వలు**




**వుదయం డెస్క్, మే 18ః**

సుదీర్ఘ పశ్చిమాసియా సంఘర్షణ కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు ఆందోళనలో ఉన్నప్పటికీ, దేశంలో తక్షణ ఇంధన సరఫరా అంతరాయం ఏదీ లేదని వినియోగదారులకు, పరిశ్రమలకు భరోసా ఇచ్చేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

ముడి చమురు ధరలు అధికంగా ఉన్నప్పటికీ, హొర్ముజ్ జలసంధి చుట్టూ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, భారతదేశంలోని రిఫైనరీలు సాధారణంగా పనిచేస్తున్నాయని, ముడి చమురు, ఎల్‌పిజి ,సహజ వాయువు నిల్వలు తగినంతగా ఉన్నాయని కేంద్రం చెబుతోంది. ఇంధన సరఫరాలు స్థిరంగా ఉన్నాయన్న ప్రభుత్వం పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వం మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని, అయితే అధికారిక ఇంధన సరఫరాలలో ఎలాంటి కొరత లేదని నొక్కి చెప్పారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమై రెండున్నర నెలలకు పైగా గడిచింది, ఇంకా హొర్ముజ్ జలసంధిలో పరిస్థితి సాధారణ స్థితికి రాలేదు. దీని ఫలితంగా, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు, సహజ వాయువు, ఎల్‌పిజి ధరలు విపరీతంగా పెరిగాయి, అని శర్మ అన్నారు. పెరుగుతున్న ప్రపంచ ధరలు, రవాణా సమస్యల కారణంగా భారతదేశ ముడి చమురు, ఎల్‌పిజి, సహజ వాయువు దిగుమతులు ప్రభావితమైనప్పటికీ, దేశంలోని రిఫైనరీ కార్యకలాపాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు. అయితే, మన రిఫైనరీలు సాధారణంగా పనిచేస్తున్నాయి, మన వద్ద తగినంత ముడి చమురు నిల్వలు ఉన్నాయి, అని ఆమె అన్నారు.

**రష్యా చమురు కొనుగోలును కొనసాగిస్తున్న భారత్**

అమెరికా ఆంక్షల మినహాయింపు చట్రంలో ఇటీవల మార్పులు ఉన్నప్పటికీ, రష్యా ముడి చమురును భారత్ కొనుగోలు చేయడం కొనసాగిస్తుందని ప్రభుత్వం సూచించింది. భారతదేశ ఇంధన కొనుగోళ్లు ప్రధానంగా వాణిజ్యపరమైన లాభదాయకత, సరఫా లభ్యతపై ఆధారపడి ఉంటాయని శర్మ అన్నారు.రష్యాపై అమెరికా మినహాయింపు విషయానికి వస్తే, మినహాయింపుకు ముందు, మినహాయింపు సమయంలో, ఇప్పుడు కూడా మనం రష్యా నుండి కొనుగోలు చేస్తున్నామని నొక్కి చెప్పాలనుకుంటున్నాను, అని ఆమె అన్నారు. రష్యా సముద్ర మార్గ చమురుకు సంబంధించిన ఆంక్షల మినహాయింపు గడువును ట్రంప్ ప్రభుత్వం ఇటీవల రద్దు చేయడంతో, ప్రపంచ చమురు మార్కెట్లలో కొత్త అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అయినప్పటికీ, భారతదేశ ఇంధన సేకరణ వ్యూహంలో తక్షణ మార్పు ఏమీ ఉండదని ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది.

మనం కొనుగోలు చేయడానికి ప్రాథమికంగా వాణిజ్యపరమైన వివేకం

## సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారం, తక్షణ సంక్షేమ చర్యలు

**వుదయం డెస్క్, మే 18ః**

కేరళం ముఖ్యమంత్రిగా విడి సతీశన్, తన మంత్రివర్గ సభ్యులతో కలిసి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పలు చర్యలు చేపట్టారు.

ఆయన ప్రకటించిన చర్యలలో మహిళలకు ఉచిత కెఎస్ ఆర్‌టిసి బస్సు ప్రయాణం, వృద్ధుల సంక్షేమాన్ని పర్యవేక్షించే ప్రత్యేక శాఖ ఏర్పాటు, ఆశా కార్యకర్తలకు రూ. 3,000 పెంపు వంటి అంశాలు ఉన్నాయి. వీటితో పాటు, 2023లో జరిగిన నవ కేరళ యాత్ర సమయంలో యూత్ కాంగ్రెస్ నాయకులపై జరిగినట్లు ఆరోపించిన దాడిపై విచారణ జరిపేందుకు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లు కూడా కొత్త మంత్రివర్గం ప్రకటించింది.

అంగన్‌వాడీ కార్యకర్తలకు తలకి రూ. 1,000 చొప్పున వేతన పెంపు

ప్రీప్రైమరీ ఉపాధ్యాయులు, పాఠశాల వంట సిబ్బందితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు కూడా నెలకు ఒక్కొక్కరికి రూ. 1,000 చొప్పున పెంపును కొత్త ముఖ్యమంత్రి ప్రకటించారు. ఒక సమాజం తన వృద్ధ పౌరులను ఎలా చూసుకుంటుందనే దానిని బట్టి ఆ సమాజాన్ని అంచనా వేస్తారు. వయోవృద్ధులకు గౌరవప్రదమైన సంరక్షణను అందించడం ద్వారా కేరళం ఒక ఆదర్శ నాగరిక సమాజంగా మారాలి, అని ఆయన అన్నట్లు హిందుస్థాన్ టైమ్స్ పేర్కొంది. ప్రమాణ స్వీకారం అనంతరం, కొత్త మంత్రివర్గం స్పీకర్‌గా ఎమ్మెల్యే జి. సుధాకరన్ పేరును ప్రతిపాదించింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, సభలో కొత్త స్పీకర్ ఎన్నిక కోసం అసెంబ్లీని సమావేశపరచాలని కూడా అది గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కోరింది. నివేదికల ప్రకారం, కొత్త ఎమ్మెల్యేలు మే 21న ప్రమాణ స్వీకారం చేయనుండగా, కొత్త స్పీకర్ మే 22న ఎన్నికయ్యే అవకాశం ఉంది.

**ఈ ప్రభుత్వం కోసం కేరళ ప్రజలు పోరాడారు: రాహుల్**

ఈ ప్రభుత్వం కోసం కేరళ ప్రజలు పోరాడారు. వారి గొంతుకే దీనికి మార్గదర్శనం చేస్తుంది.

**సముద్ర ఆధారిత అణు ద్వితీయ-దాడి**

## ఆయుధాన్ని కోరిన పాక్, నిరాకరించిన చైనా లీకైన దౌత్య పత్రాలు

వుదయం డెస్క్, మే 18ః 2024లో, పాకిస్తాన్ తన సర్వకాల మిత్రదేశం అయిన చైనా నుండి సముద్రం ఆధారిత అణు ద్వితీయదాడి సామర్థ్యాన్ని (సీ బేస్డ్ న్యూక్లియర్ సెకెండ్ స్ట్రైక్ కేపబిలిటీ) కోరింది. కాగా, డ్రాప్ సైట్ న్యూస్ విడుదల చేసిన రహస్య పత్రాల ప్రకారం, ఇస్లామాబాద్‌కు ఇప్పటికే ఆయుధాలను, భారీ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నప్పటికీ, అణు నిరోధక వ్యవస్థలో అత్యంత సున్నితమైన భాగాలలో ఒకటిగా పరిగణించే ఆ సామర్థ్యాన్ని బదిలీ చేయడానికి బీజింగ్ నిరాకరించింది. పాకిస్తాన్ అభ్యర్థనను చైనా అసమంజసమైనదిగా అభివర్ణించిందని, అటువంటి సామర్థ్యాన్ని అందించడం దక్షిణాసియాలో అణువ్యాప్తిలో చైనా ప్రత్యక్ష ప్రమేయానికి దారితీస్తుందని హెచ్చరించినట్లు సమాచారం. డీప్ వాటర్ గ్వాదర్ పోర్టును శాశ్వత చైనా సైనిక స్థావరంగా మార్చేందుకు చైనాకు అనుమతి ఇచ్చే ముందు పాకిస్థాన్ అనేక షరతులు విధించిందని, దశాబ్దానికి పైగా ఇస్లామాబాద్ ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ వచ్చిందని ఆ పత్రాలు పేర్కొన్నాయి. నివేదిక ప్రకారం, ఈ చర్యపై అమెరికా చేపట్టే రాజకీయ, ఆర్థిక, లేదా దౌత్యపరమైన ప్రతీకార చర్యలకు వ్యతిరేకంగా చైనా నుండి పాకిస్తాన్ హామీ కోరింది. భారతదేశంతో పోటీలో పాకిస్తాన్ రక్షణ, నిఘా సామర్థ్యాలను నిలబెట్టుకోవడంలో సహాయపడటానికి సైనిక ఆధునీకరణ సహాయాన్ని అందించాలని ఇస్లామాబాద్ బీజింగ్‌ను కోరింది.

**సముద్ర ఆధారిత అణు ద్వితీయదాడి సామర్థ్యం గురించి**

సముద్ర ఆధారిత అణు ద్వితీయదాడి సామర్థ్యం అంటే, ఒక దేశం తీవ్రమైన తొలిదాడిని ఎదుర్కొన్న తర్వాత కూడా ప్రతీకార అణుదాడిని ప్రారంభించగల సామర్థ్యం. ఇది అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాముల (ఎస్ఎస్‌బిఎన్‌ల)పై ఆధారపడి ఉంటుంది. ఇవి నీటి అడుగున రహస్యంగా ఉంటాయి. వీటిని గుర్తించడం లేదా నాశనం చేయడం అత్యంత కష్టం. ఈ సామర్థ్యం ఒక శక్తివంతమైన నిరోధకంగా పనిచేస్తుంది, ఏ శత్రువు కూడా ఆకస్మిక దాడిలో ఒక దేశపు అణ్వాయుధాగారాన్ని నాశనం చేయకుండా ఇది నిర్ధారిస్తుంది. దీనిని కొనసాగించడానికి, దేశాలు అధునాతన స్టెల్త్, సురక్షిత కమ్యూనికేషన్ వ్యవస్థల మద్దతుతో, కనీసం ఒక ఎస్ ఎస్‌బిఎన్‌ను అన్ని వేళలా గస్తీలో ఉంచాలి. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి



జలాంతర్గాములను కలిగి ఉన్న ఆరు దేశాలు మాత్రమే సముద్ర ఆధారిత అణు ద్వితీయదాడి సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. యునైటెడ్ స్టేట్స్ అత్యంత అధునాతనమైన ఒహాయోతరగతి నౌకల పెద్ద సముదాయాన్ని నిర్వహిస్తుండగా, రష్యా ఆర్కిటిక్, పసిఫిక్‌లలో గస్తీ కోసం తన ఆధునిక బోరీతరగతి జలాంతర్గాములపై ఆధారపడుతుంది. చైనా, సుదూర బాలిస్టిక్ క్షిపణులతో కూడిన టైప్ 094 జలాంతర్గాములను ఉపయోగించి తన నిరోధక శక్తిని పటిష్టం చేసుకుంది. ఐరోపాలో, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్ తమ మొత్తం అణు వ్యూహాలను సముద్రంపైనే ఆధారపడి చేస్తాయి, ప్రతి దేశం కనీసం ఒక జలాంతర్గామి అన్ని వేళలా శాశ్వతంగా గస్తీలో ఉండేలా చూసుకుంటుంది. భారతదేశం దేశీయ అరిహంత్‌క్లాస్ కార్యక్రమం ద్వారా తన సామర్థ్యాన్ని సాధించింది, ఇది నిరంతర నిరోధక భ్రమణాన్ని నిర్ధారించడానికి విస్తరిస్తూనే ఉంది. ఈ అగ్రరాజ్యాలకు అతీతంగా, ఇజ్రాయెల్ సవరించిన, సాంప్రదాయ డాల్ఫిన్‌క్లాస్ జలాంతర్గాములను ఉపయోగించి ప్రాంతీయ ద్వితీయదాడి సామర్థ్యాన్ని నిర్వహిస్తోందని విస్తృతంగా నమ్ముతారు.

## ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ను ఉపసంహరించుకున్న రాబర్ట్ వాద్రా

**హర్యానా భూ ఒప్పందం కేసులో ట్రయల్ కోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్**

**వుదయం డెస్క్, మే 18ః**

హర్యానాలోని ఒక భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని కోరుతూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన తన పిటిషన్‌ను వ్యాపారవేత్త, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ భర్త అయిన రాబర్ట్ వాద్రా సోమవారం ఉపసంహరించుకున్నారు. వాద్రాపై జరుగుతున్న విచారణ, గురుగ్రామ్ జిల్లాలోని మనేసర్‌షికోపూర్ (ప్రస్తుతం సెక్టార్ 83) వద్ద జరిగిన భూ ఒప్పందానికి సంబంధించినది. పిటిషనర్ తరపు న్యాయవాది, విచారణ ప్రారంభంలోనే, తనకు అందిన సూచనల ప్రకారం, ప్రస్తుత పిటిషన్‌ను కొనసాగించడానికి పిటిషనర్‌కు ఆసక్తి లేదని, కాబట్టి వారు ఎటువంటి షరతులు లేకుండా దీనిని ఉపసంహరించుకోవాలనుకుంటున్నారని తెలియజేశారు, అని న్యాయమూర్తి మనోజ్ జైన్ తన ఉత్తర్వులో నమోదు చేశారు. వాద్రా తరపు న్యాయవాది, తాను తగిన సమయంలో విచారణ కోర్టు ముందు తగిన వాదనలు వినిపిస్తానని చెప్పారు. ఇరు పక్షాల అన్ని హక్కులు, వాదనలు యథాతథంగా కొనసాగుతాయని, పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని జస్టిస్ జైన్ తెలిపారు. గత వారం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఈ పిటిషన్‌ను వ్యతిరేకించింది. ఇది తప్పుడు వాదనపై ఆధారపడి ఉందని వాదించింది. పిటిషనర్‌పై భారత శిక్షా స్మృతి, అవినీతి నిరోధక చట్టం కింద నమోదు చేసిన నేరాలు, సంబంధిత సమయంలో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద షెడ్యూల్డ్ నేరాలు కానందున, ఈ కేసును దర్యాప్తు చేసే అధికార పరిధి ఈడీకి లేదని వాదించిన వాద్రా తరపు న్యాయవాది, సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ వాదనను తిప్పికొడుతూ ఏజెన్సీ ఈ వాదన చేసింది.

సదరు భూ ఒప్పందం 2008 2012 మధ్య జరిగిందని స్వయంగా అంగీకరించినప్పటికీ, ఈడీ కేసుకి ఆధారమైన నేరాలను మాత్రం 2013, 2018లో మాత్రమే షెడ్యూల్‌లో చేర్చారని సింఘ్వి వాదించారు. అయితే, పిటిషనర్ చేసిన వాదన సరికాదని, అది చట్టపరంగా పూర్తిగా అసత్యమైన ప్రకటన అని ఈడీ తరపు న్యాయవాది పేర్కొన్నారు.

ఏప్రిల్ 15, 2026న, జూలై 2025లో ఈడీ దాఖలు చేసిన అభియోగపత్రంలోని నేరాలను విచారణ న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. మే 16న తమ ఎదుట హాజరు కావాలని వాద్రాను, ఇతరులను ఆదేశించింది. ఒక దర్యాప్తు సంస్థ 57 ఏళ్ల వాద్రాపై ఒక క్రిమినల్ కేసులో అభియోగపత్రాన్ని దాఖలు చేయడం ఇదే మొదటిసారి. ఏప్రిల్ 2025లో, ఈడీ ఆయనను వరుసగా మూడు రోజుల పాటు ప్రశ్నించింది. ప్రత్యేక న్యాయమూర్తి సుశాంత్ చాంగోత్రా తన విచారణ ఉత్తర్వులో, ఛార్జిషీట్, పత్రాలను ప్రాథమికంగా విస్తృతంగా పరిశీలించగా, వాద్రా, మరో ఎనిమిది మంది నిందితులపై తదుపరి చర్యలు కొనసాగించడానికి తగినంత సాక్ష్యం లభించిందని పేర్కొన్నారు.




అందువల్ల, మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 4 కింద శిక్షార్హమైన సెక్షన్ 3 (మనీ లాండరింగ్)ను సెక్షన్ 70 (కంపెనీలు చేసే నేరాలు)తో కలిపి చదివినప్పుడు వచ్చే నేరాలను నేను విచారణకు స్వీకరిస్తున్నాను, అని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన భూ లావాదేవీని, వాద్రా గతంలో డైరెక్టర్‌గా వ్యవహరించిన స్కైలైట్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ, 2008 ఫిబ్రవరిలో పూర్తి చేసింది. ఈ ఒప్పందం కింద, ఆ సంస్థ షికోహ్‌పూర్‌లోని 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీస్ నుండి రూ. 7.5 కోట్లకు కొనుగోలు చేసింది. ఆ సమయంలో, హర్యానాలో భూపిందర్ సింగ్ హుడా నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. నాలుగేళ్ల తర్వాత, సెప్టెంబర్ 2012లో, ఆ సంస్థ ఆ భూమిని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ అయిన డిఎల్ ఎఫ్‌కు రూ. 58 కోట్లకు విక్రయించింది. అప్పటికి భూ సమీకరణ, భూ రికార్డుల డైరెక్టర్ జనరల్‌కమ్‌రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఐఎఎస్ అధికారి అశోక్ ఖేమ్కా, ఈ లావాదేవీ రాష్ట్ర భూ సమీకరణ చట్టానికి, సంబంధిత నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ భూ యాజమాన్య మార్పిడిని (మ్యుటేషన్) రద్దు చేయడంతో, అక్టోబర్ 2012లో ఈ ఒప్పందం వివాదాల్లో చిక్కుకుంది. వాద్రా తాను ఎలాంటి తప్పు చేయలేదని ఖండిస్తూ, ఈ కేసును తనపైనా, తన కుటుంబంపైనా, మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో సహా అందరిపైనా పెట్టిన రాజకీయ కక్ష సాధింపు చర్య అని పేర్కొన్నారు. వాద్రాతో పాటు, కేవల్ సింగ్ విర్క్, స్కై లైట్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రస్తుతం స్కైలైట్ హాస్పిటాలిటీ ఎల్‌ఎల్‌పి), స్కై లైట్ రియల్టీ ప్రైవేట్ లిమిటెడ్, రియల్ ఎర్త్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రస్తుతం రియల్ ఎర్త్ ఎస్టేట్స్ ఎల్‌ఎల్‌పి), బ్లూ బ్రీజ్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రస్తుతం బ్లూ బ్రీజ్ ట్రేడింగ్ ఎల్‌ఎల్‌పి), ఇతరులకు కూడా సమన్లు జారీ చేశారు.

## ఇంధన పొదుపు కోసం సిక్కిం సిఎం నడక

**వుదయం డెస్క్, మే 18ః**

ఇంధనం పొదుపు చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు, సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ సోమవారం ఒక అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు తన అధికారిక నివాసం నుంచి 2 కిలోమీటర్లకు పైగా నడిచారు. కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి టాక్సీలో తన నివాసానికి తిరిగి వచ్చారు. పశ్చిమాసియాలో సంక్షోభం నెలకొన్న వేళ ఇంధన వినియోగాన్ని తగ్గించాలని దేశ ప్రజలకు మోడీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ప్రధాని మోడీ పిలుపు మేరకు గత కొద్ది రోజులుగా ఆయన అధికారిక నివాసంలోని సమీప ప్రాంతాలకు కాలి నడకనే వెళుతుండటం గమనార్హం. ఇంధన పొదుపు కోసం రహదారులపై ప్రభుత్వ వాహనాలు శని, ఆదివారాల్లో సరిబేసి నిబంధనలను పాటించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ నిబంధన నుంచి ప్రైవేటు వాహనాలకు మినహాయింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మరిన్ని ఇంధన పొదుపు చర్యలను త్వరలోనే అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

## ఇంధన పొదుపు కోసం సిక్కిం సిఎం నడక

వుదయం డెస్క్, మే 18ః ఇంధనం పొదుపు చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు, సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ సోమవారం ఒక అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు తన అధికారిక నివాసం నుంచి 2 కిలోమీటర్లకు పైగా నడిచారు. కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి టాక్సీలో తన నివాసానికి తిరిగి వచ్చారు. పశ్చిమాసియాలో సంక్షోభం నెలకొన్న వేళ ఇంధన వినియోగాన్ని తగ్గించాలని దేశ ప్రజలకు మోడీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.
ప్రధాని మోడీ పిలుపు మేరకు గత కొద్ది రోజులుగా ఆయన అధికారిక నివాసంలోని సమీప ప్రాంతాలకు కాలి నడకనే వెళుతుండటం గమనార్హం. ఇంధన పొదుపు కోసం రహదారులపై ప్రభుత్వ వాహనాలు శని, ఆదివారాల్లో సరిబేసి నిబంధనలను పాటించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ




నిబంధన నుంచి ప్రైవేటు వాహనాలకు మినహాయింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మరిన్ని ఇంధన పొదుపు చర్యలను త్వరలోనే అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

## అమ్మ క్యాంటీన్లను పునరుద్ధరించాలని విజయ్ ఆదేశం

**వుదయం డెస్క్, మే 18ః** ఎఐఎడిఎంకె ప్రభుత్వ హయాంలో, 201116లో ప్రారంభించిన అమ్మ క్యాంటీన్ల (లేదా ఉనవగాల)ను రాష్ట్రవ్యాప్తంగా పునరుద్ధరించి, ఆధునీకరించాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సోమవారం ఆదేశించారు. మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు ఆప్యాయంగా 'అమ్మ' అని పిలిచే, నాటి ముఖ్యమంత్రి జె. జయలలిత జన్మదినమైన ఫిబ్రవరి 24, 2013న ప్రారంభించిన ఈ క్యాంటీన్లు, మొదట చెన్నైలో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత, వీటిని వివిధ పట్టణాలు, నగరాలకు విస్తరించారు. అమ్మ క్యాంటీన్ల మౌలిక సదుపాయాలను ఆధునీకరించి మెరుగుపరచాలని, అలాగే ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని విజయ్ అధికారులను ఆదేశించారు. అమ్మ క్యాంటీన్లలో అందించే ఆహారం నాణ్యత, రుచి సంతృప్తికరంగా లేవని వచ్చిన అభిప్రాయాలు ముఖ్యమంత్రి దృష్టికి వచ్చిన అనంతరం, ఆయన ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సౌకర్యాలు, మౌలిక వసతులను మెరుగుపరచాలని, అలాగే వంటకు అవసరమైన మరిన్ని పాత్రలు, పరికరాలను సమకూర్చడం ద్వారా ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఒక అధికారిక ప్రకటన తెలిపింది.

## మండే ఎండలు, వడగాలులకు ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆరోగ్య సూచనలు



**న్యూఢిల్లీ, మే 18 (పిఐబి)ః** దేశంలోని పలు ప్రాంతాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమవుతున్న వడగాలుల నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) ఆధ్వర్యంలోని ఆయుష్ విభాగం, కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రస్తుత వేసవి కాలానికి గానూ సమగ్రమైన ప్రజారోగ్య సలహాలను జారీ చేసింది. ఇందులో వడదెబ్బ, ఎండ తీవ్రత నుంచి తగిన రక్షణ పొందేందుకు వీలుగా సాధారణ ప్రజలు, వృద్ధులు, గర్భిణులు, ఉద్యోగులు, కార్మికులు, అలాగే బహిరంగ సభలు, క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనే వారి కోసం వివరణాత్మక మార్గదర్శకాలను అందించింది. శరీరానికి సరిపడా నీరు తాగడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్న సమయాల్లో నేరుగా ఎండ తగలకుండా చూసుకోవడం, లేత రంగు కాటన్ దుస్తులను ధరించడం, ఆయా కాలాల్లో లభించే పండ్లు, ఎలక్ట్రోలైట్లు ఎక్కువగా ఉండే ద్రవ పదార్థాలను తీసుకోవడం వంటి అంశాల గురించి వివరించింది. వడగాలుల సమయంలో శిశువులు, చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులు, ఎండలో పనిచేసే కార్మికులు, గుండె జబ్బులు, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు చాలా త్వరగా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, వీరి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు నిరంతరం పర్యవేక్షణ అవసరమని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పని ప్రదేశాలు, బహిరంగ సభల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలను సూచించింది. వీటిలో విశ్రాంతి తీసుకోవడానికి నీడ కలిగిన ప్రాంతాలను ఏర్పాటు చేయడం, క్రమం తప్పకుండా నీరు తాగేందుకు విరామం తీసుకోవడం, వాతావరణ పరిస్థితులకు అలవాటు పడేలా కార్మికులకు తగిన వసతులు కల్పించడం, వడదెబ్బ లక్షణాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

## బెయిల్ నియమం, జైలు మినహాయింపు, యుఎపిఎ కేసుల్లోనూ ఇదే వర్తిస్తుంది ః సుప్రీం

**వుదయం డెస్క్, మే 18ః**



2020 ఢిల్లీ అల్లర్ల కుట్ర కేసులో విద్యార్థి నాయకులమని చెప్పుకున్న ఉద్యమ కార్యకర్తలు ఉమర్ ఖాలిద్‌కు బెయిల్ నిరాకరిస్తూ ఇచ్చిన మునుపటి తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) వంటి కఠినమైన చట్టాలు వర్తించే కేసులలో కూడా బెయిల్ అనేది నియమం, జైలు అనేది మినహాయింపు అని సుప్రీంకోర్టు సోమవారం పునరుద్ఘాటించింది. జనవరి 2026లో, ఖాలిద్, జెఎన్‌యు విద్యార్థి షర్జీల్ ఇమామ్‌లకు బెయిల్ మంజూరు చేయడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది.

వారిపై ఉన్న ఆరోపణలు ప్రాథమికంగా యుఎపిఎ కింద నేరాలను వెల్లడిస్తున్నాయని కోర్టు పేర్కొంది. ఆరోపణల తీవ్రత, ప్రాసిక్యూషన్ సేకరించిన సాక్ష్యాధారాలు, ఆ దశలో బెయిల్ మంజూరు చేయడానికి ప్రతికూలంగా ఉన్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. జమ్మూ కాశ్మీర్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఉగ్రవాద నిధులకు సంబంధించిన ఒక ఆరోపిత సరిహద్దు సిండికేట్ కేసులో విచారణ ఎదుర్కొంటున్న హంద్వారా నివాసి సయ్యద్ ఇఫ్తికార్ ఆంద్రబీకి బెయిల్ మంజూరు చేస్తూ, న్యాయమూర్తులు బి.వి. నాగరత్న, ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. యుఎపిఎ, భారతీయ శిక్షా స్మృతి (ఐపిసి) లోని సంబంధిత నిబంధనల కింద 2020లో నమోదైన కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) విచారిస్తోంది. సరిహద్దు ఆవల ఉన్న ఉగ్రవాద కార్యకర్తలతో తాను సంప్రదింపులు జరిపినట్లు సెల్‌ఫోన్ రికార్డులు సూచిస్తున్నాయనే కారణంతో, తన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ జమ్మూ కాశ్మీర్, లడఖ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును ఆంద్రాబీ సవాలు చేశారు. అతడికి ఉపశమనం కల్పిస్తూ, ఆంద్రాబీ తన పాస్‌పోర్ట్‌ను అప్పగించాలని, ప్రతి 15 రోజులకోసారి స్థానిక పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. బెయిల్ మంజూరుపై కఠిన ఆంక్షలను విధించే యుఎపిఎలోని సెక్షన్ 43D(5)ను, నిరవధిక నిర్బంధాన్ని సమర్థించడానికి వినియోగించకూడదని; అది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 21, 22 పరిధిలోనే పనిచేయాలని ధర్మాసనం పేర్కొంది. యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ కేఏ నజీబ్ కేసులో తాము 2021లో ఇచ్చిన తీర్పు ఇప్పటికీ కట్టుబడి ఉండాల్సిన చట్టంగా కొనసాగుతుందని, దానిని ట్రయల్ కోర్టులు, హైకోర్టులు లేదా సుప్రీంకోర్టులోని చిన్న ధర్మాసనాలు కూడా నీరుగార్చడం, తప్పించుకోవడం లేదా విస్మరించడం చేయలేవని కోర్టు పునరుద్ఘాటించింది. సుదీర్ఘకాలం జైలు శిక్ష విధించడం ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే సందర్భాలలో, యూఏపీఏ కేసులలో రాజ్యాంగ న్యాయస్థానాలు బెయిల్ మంజూరు చేయవచ్చని కేఏ నజీబ్ తీర్పు గుర్తించింది. విచారణ సందర్భంగా, ఢిల్లీ అల్లర్ల బృహత్ కుట్ర కేసులో ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్‌లకు బెయిల్ నిరాకరిస్తూ జనవరి 2026లో ఇచ్చిన తీర్పుతో సహా, కేఏ నజీబ్ కేసులో నిర్దేశించిన సూత్రాల నుండి వైదొలగినట్లు కనిపించిన తదుపరి తీర్పులపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. యుఎపిఎ వంటి ప్రత్యేక చట్టాల కింద బెయిల్ పిటిషన్లను పరిశీలించేటప్పుడు, సుదీర్ఘ కారాగారవాసాన్ని, విచారణలో జాప్యాన్ని విస్మరించలేమని జస్టిస్

## నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఎన్‌టిఎ అధిపతికి పార్లమెంటరీ కమిటీ సమన్లు




వుదయం డెస్క్, మే 18ః దేశంలోనే అత్యంత క్లిష్టమైన, పోటీతత్వం కలిగిన పరీక్షలలో ఒకటైన నీట్ యూజీ నిర్వహణలో ఉన్న విధానపరమైన లోపాలపై తీవ్ర ఆందోళనలను రేకెత్తించిన ప్రశ్నాపత్ర లీకేజీ ఘటన నేపథ్యంలో, సంస్కరణలను సమీక్షించేందుకు పార్లమెంటరీ కమిటీ సోమవారం నాడు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) అధిపతికి సమన్లు జారీ చేసి తమ ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. ఎన్‌టిఎ ఛైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి, ఇతర ఉన్నతాధికారులను మే 21న చర్చల నిమిత్తం పిలిచారు. వివిధ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం కేంద్రీకృత ప్రవేశ పరీక్షలను నిర్వహించే ఎన్‌టిఎకి సంబంధించిన సంస్కరణలు, అలాగే పేపర్ లీకేజీ ఆరోపణలపై విద్యా మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారుల అభిప్రాయాలను మే 21న విద్యా, మహిళా, శిశు, యువజన, క్రీడల పార్లమెంటరీ స్థాయీ సంఘం కోరనుందని, రాజ్యసభ నోటీసును ఉటంకిస్తూ పిటిఐ వార్తా సంస్థ తెలిపింది. ఎన్‌టిఎ సంస్కరణలపై కె. రాధాకృష్ణన్ కమిటీ నివేదిక అమలు తీరు సమీక్ష, అలాగే నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలకు సంబంధించిన దర్యాప్తు పురోగతిపై తాజా సమాచారం ఈ అజెండాలో ఉన్నాయి. కాంగ్రెస్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని ఈ కమిటీ, విద్యా మంత్రిత్వ శాఖలోని ఉన్నత విద్యా విభాగం కార్యదర్శి వినీత్ జోషిని కూడా తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో, మే 3న నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (అండర్ గ్రాడ్యుయేట్)ను ఎన్‌టిఎ రద్దు చేసింది. దేశవ్యాప్తంగా ఎన్‌టిఎ నిర్వహించిన ఈ పరీక్ష కోసం దాదాపు 23 లక్షల మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. ఎన్‌టిఎ తెలిపిన వివరాల ప్రకారం, పరీక్ష నిర్వహించిన నాలుగు రోజుల తర్వాత, మే 7 సాయంత్రం నాటికి, ఆరోపిత అవకతవకలకు సంబంధించిన సమాచారం అందింది.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం కృషి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జిల్లా , మే18 (ఉదయం ప్రతినిధి)**

ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఐ. బి. చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా క్రీడాధికార సంస్థ మైదానం వరకు చేపట్టిన తెలంగాణ మారథాన్ఫిజికల్ లీటరసి కార్యక్రమంలో డి సి పి భాస్కర్, గుడిపేట 13వ పటాలము కమాండెంట్ వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంతరెడ్డి,జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, ఎ. సి. పి. ప్రకాష్, యువతీ యువకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశం యువ భారతదేశం అని, దేశంలో యువ జనాభా అధికంగా ఉందని తెలిపారు. రాష్ట్ర, దేశ అభివృద్ధిలో యువత అత్యంత కీలకమని, దేశ అభివృద్ధి కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. ఆరోగ్యం, క్రమశిక్షణ కలిగి ఉండాలని, వ్యాయామం, యోగ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాలు, మద్యం వల్ల కలిగే అనర్థాలను తెలుసుకొని యువత వాటికి దూరంగా ఉండాలని, మాదకద్రవ్య రహిత తెలంగాణగా సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. "నో టు డ్రగ్స్ ఎస్ టు ఎక్సర్సైజ్" నినాదం దిశగా ప్రతి ఒక్కరు ఆరోగ్యం వైపు అడుగులు వేయాలని, ప్రతి ఒక్కరికి ఆరోగ్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా శారీరక రుగ్మత, మానసిక ఆందోళనల నుంచి బయటపడవచ్చు అని, అనారోగ్యం దరిచేరకుండా కాపాడుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువతి యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**నిర్మల్ జిల్లా , మే18 (ఉదయం ప్రతినిధి)**



బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బక్రీద్ పండుగ ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రార్థనా స్థలాల్లో తాగునీటి సౌకర్యం తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.పండుగ నేపథ్యంలో పురపాలక, గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈద్గాల పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం కల్పించాలని సూచించారు. అలాగే ప్రార్థనల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.జిల్లా ప్రజలు అన్ని పండుగలను పరస్పర సహకారం, సామరస్యంతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున తగిన బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అడిషనల్ ఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, నిర్మల్, భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్లు అప్పాల గణేష్ చక్రవర్తి, బిబి కుతిజ సిద్ధికి, వివిధ శాఖల అధికారులు, హిందు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



## అడవుల రక్షణకు అందరూ కృషి చేయాలి

- జిల్లా అటవీ శాఖ అధికారి బాలామణి.
- అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణ కోసం మాక్ డ్రిల్.

**ఆసిఫాబాద్ ( ఉదయం ప్రతినిధి )**

అడవులు కాపాడడం అందరి బాధ్యత అని అందరూ కూడా బాధ్యతగా మెలగాల్సిన అవసరం ఉందని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ బాలామణి అన్నారు. ఆకస్మిక విపత్తు అటవీ అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు పై వివిధ శాఖల సమన్వయాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో కాగజ్‌నగర్ డివిజన్‌లోని వేంపల్లి ఫారెస్ట్ లో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇందులో జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ బాలామణి పాల్గొని మాట్లాడారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అధారిటీ

ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అడవిలో అగ్నిప్రమాదాలు జరిగితే ఎలా స్పందించాలి ,వాటి కంట్రోల్ ఎలా అన్నది తెలుసుకునేందుకు ఈ మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతోందని అన్నారు. అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ, ఎస్ డీ ఆర్ ఎఫ్,రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, వెటర్నరీ, వైద్య ఆరోగ్య శాఖలు సహా మొత్తం 19శాఖలు మాక్ డ్రిల్ లో పాల్గొన్నాయి. పర్యావరణ సమతుల్యం కాపాడేందుకు అందరూ అటవీ శాఖ కు సహకరించాలని అన్నారు .మాక్ డ్రిల్ కోసం సమీపం లోని పెద్దబండ , కోసినీ గ్రామాలకు చెందిన 80 మందిని వేంపల్లి హరిణి పార్క్ రీ హ్యాబిటేషన్ సెంటర్ లో తరలించారు.జిల్లా ఫైర్ ఆఫీసర్ సురేశ్ కుమార్, ఎస్ డీ ఆర్ ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషణం, కాగజ్ నగర్ ఎఫ్ డీ ఓ అప్పయ్య, ఏఎంవీఐ రాజశేఖర్, అబ్జర్వర్ క్రాంతి, డీ పీఆర్వో సంపత్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరదలపై మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహణ

**కామారెడ్డి, మే 18 (ఉదయం ప్రతినిధి):-**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వరదలపై మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహణప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విపత్తు నిర్వహణ- 2026 కార్యక్రమంలో వరదలపై మాక్ ఎక్సర్‌సైజ్‌ను కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కౌండిల్య కాలనీలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని వివిధ డెమోలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వరదల సమయంలో ఎదురయ్యే అత్యవసర పరిస్థితులను ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయం, స్పందన వ్యవస్థలు, సహాయక చర్యలను సమీక్షించి మరింత మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేస్తూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగంగా సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. మాక్ డ్రిల్ ద్వారా విపత్తు నిర్వహణలో లోపాలను గుర్తించి స్పందన వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు.జిల్లాలోని 7 మండలాల్లో ఈ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. కామారెడ్డి మండలంలోని కౌండిల్య కాలనీ, బిక్నూర్ మండలంలోని రామేశ్వరపల్లి, రాజంపేట మండలంలోని గుండారం, బీబీపేట్ మండలంలోని పెద్ద చెరువు, మద్నూర్ మండలంలోని బొగ్గుగుడిసె, ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలంలోని మేజర్‌వాడ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరావాస ఏర్పాట్లు, శాఖల సమన్వయం తదితర అంశాలపై అధికారులు ప్రత్యక్ష సాధన నిర్వహించారు.



వరదల్లో కొట్టుకుపోయిన బాధితులకు అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ద్వారా ఎలా ప్రాథమిక చికిత్స అందించాలో, అలాగే వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా ఎలా రక్షించాలో డెమో ద్వారా అవగాహన కల్పించారు. సహాయక బృందాలు ప్రాణాపాయ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రెస్క్యూ పరికరాల వినియోగం, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు.అనంతరం మాక్ డ్రిల్‌లో పాల్గొన్న సిబ్బంది, సంబంధిత అధికారులకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కామారెడ్డి, బీబీపేట్ పర్యవేక్షకులుగా లేబర్ శాఖ అధికారి శశికుమార్, పోలీస్ బెటాలియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఏసీఎల్ బి ఇన్‌చార్జ్ ఎన్‌వీ గిరి, డి ఎఫ్ ఓ సుధాకర్, డీసీఎంహెచ్ ఓ విజయభాస్కర్, పీడీ మెప్మా శ్రీధర్, పబ్లిక్ హెల్త్ డీఈ సంతోష్, యువత, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జూమ్ మీటింగ్ ద్వారా హైదరాబాద్‌లోని విపత్తు నిర్వహణ అధికారులు మానిటరింగ్ చేశారు.

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



**నిజామాబాద్, మే18 (ఉదయం ప్రతినిధి)**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 150 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు

కాగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజా పాలన సభలను విజయవంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిగేలా పరస్పర సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం.. ఫిట్నెస్ పై అవగాహన కల్పించేందుకు 2కే రన్

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా యువజన క్రీడా వారోత్సవాల కింద రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో 2కే రన్లో హాజరైన ఎస్పీ మహేష్ బి గితే

**రాజన్న సిరిసిల్ల ,మే18 (ఉదయం ప్రతినిధి):**

విద్యార్థులు, యువతలో ఆరోగ్యం.. ఫిట్నెస్ పై అవగాహన కల్పించేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా యువజన క్రీడా వారోత్సవాల్లో 2కే రన్ నిర్వహించామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్ జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. జెండా ఊపి 2 కే రన్ ప్రారంభించి.. అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్





గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో అరైవ్.. అలైవ్ లో భాగంగా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించామని డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు. చైల్డ్ సేఫ్టీ వీక్ కింద మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని, పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని, డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ఈ నెల 19 వ తేదీన జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కెరీర్ & నైపుణ్యాభివృద్ధి నిర్వహించి, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శకత్వంపై యువతకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన సిరిసిల్లలోని మినీ స్టేడియంలో క్రీడా దినోత్సవంలో భాగంగా కబడ్డీ, వాలీబాల్, కరాటే, షటిల్ బ్యాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 22వ జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు ఉదయం వేములవాడ పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, హరిత హోటల్ సమీపంలోని పరిసరాలలో స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం సిరిసిల్ల కొత్త చెరువు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ నెల 23వ తేదీన సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని కె కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి ఉద్యోగ సాధన పేరుతో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో యువత, కిశోర బాల బాలికలు అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, డీవైఎస్ఓ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



## వడ్ల కొనుగోలులో జాప్యంపై బీఆర్ఎస్ ఆగ్రహం

- క్వింటాకు 5 కిలోల తరుగు తీయడంపై మండిపాటు
- ధర్మపురి మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

**ధర్మపురి,మే18(ఉదయం ప్రతినిధి):**

ధర్మపురి మార్కెట్ యార్డ్‌లో నెల రోజులుగా వడ్ల కొనుగోళ్లు సాగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవా రం మార్కెట్ యార్డ్‌ను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించి, అక్క డున్న డిప్యూటీ తహసీల్దార్ తిరుపతితో మాట్లాడి రైతు సమస్య లను వివరించారు.ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేష్ కుమా ర్ మాట్లాడుతూ ఒక బస్తాకు తరుగు పేరుతో 42 కిలోల 200 గ్రాములు జోకుతూ, క్వింటాలుకు దాదాపు 5 కిలోల కటింగ్ చేస్తున్నారని మండి పడ్డారు. ఈ కటింగ్ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్తుందో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఎండలో రైతు లు నెల రోజులుగా అల్లాడుతు న్నారు.జోకిన బస్తాలను కూడా పది రోజులుగా తరలించడం లేదు. కనీసం సుతిలి దారాలు, ఇంక్ బాటిల్స్ కూడా రైతుల చేతే కొనిపించడం ఈ ప్రభుత్వ చేతకా ని తనానికి నిదర్శనం.రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించి,వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలని,లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ సంగి సత్తెమ్మ, పట్టణ కన్వీనర్ బండారి రంజి త్,నాయకులు వోడ్నాల మల్లేశం, చిలువేరి శ్యామ్ సుందర్,పెరుమాండ్ల ఎల్లగౌడ్,చిర్నెని.నర్సయ్య, చుక్క.రవి,బండారి అశోక్,కళ్లెం.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలన



- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

**జగిత్యాల మే 18 (ఉదయం ప్రతినిధి)**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ వేగవంతం చేయాలనే ఉదేశ్యంతో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సోమవారం బీర్పూర్ మండలం చర్లపల్లి నరసింహుల పల్లి కందెన కుంట తుంగూర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు ధాన్యం తూకం నిల్వ రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని రైతులకు సమగ్ర సేవలు అందేలా



చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలన్నారు అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలన్నారు ఈ పరిశీలనలో డిఎస్ఓ జితేందర్ రెడ్డి తహసీల్దార్ సుజాత సంబంధిత అధికారులు రెవెన్యూ సిబ్బంది నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

## జోగిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



**కరీంనగర్ మే 18 (ఉదయం ప్రతినిధి):**

ఇటీవల అనారోగ్యంతో మరణించిన తిమ్మాపూర్ మాజీ ఎంపీటీసీ ఎడ్ల జోగిరెడ్డి కుటుంబ సభ్యులను మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మెన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. సోమవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా జోగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మరణానికి దారితీసిన పరిస్థితుల గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

జోగిరెడ్డి మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ వారికి సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి,మహాత్మానగర్ సర్పంచ్ పొన్నాల సంపత్, పార్టీ నాయకులు పోలు రాము,రమేశ్, నగునూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంపై అవగాహన సదస్సు

- అర్హులైన ఒక్క ఓటరును కూడా తొలగించరు – ఈఆర్ఓ & ఆర్‌డీఓ గంగయ్య

**పెద్దపల్లి,మే 18 ( కరస్పాండెంట్ న్యూస్)**

భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమం-2026 పై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ మహిళా సమాఖ్య సంఘాల అధ్యక్షులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని పెద్దపల్లిలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈఆర్ఓ & ఆర్‌డీఓ గంగయ్య మాట్లాడుతూ,ప్రస్తుతం ఉన్న 2025 ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరు 2002 ఓటరు జాబితాతో ఈ నెలాఖరు వరకు మ్యాపింగ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో అర్హులైన ఒక్క ఓటరును కూడా తొలగించబోమని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడుతుందని





పేర్కొన్నారు.అలాగే గ్రామాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు గ్రామ సర్పంచులు, మహిళా సంఘాల అధ్యక్షులు ప్రత్యేకంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి, సంబంధిత జాబితాలను ఈఆర్ఓ కార్యాలయానికి సమర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ ఎం. విజేందర్, మాస్టర్ ట్రైనర్ అనిల్ కుమార్, ఎన్నికల నాయబ్ తహశీల్దార్ పి. రవీందర్, సీనియర్ అసిస్టెంట్ టి. అంజయ్య, బూత్ స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, మహిళా సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## రత్నాలపల్లి గ్రామాన్ని సందర్శించిన కోరుట్ల సీఐ.

**జగిత్యాల:మేడిపల్లి, ఉదయం,మే 18:**

జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమారం మండలం రత్నాలపల్లి గ్రామంలో మేడిపల్లి పోలీస్ వారు ఏర్పాటు చేసిన సామాజిక అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోరుట్ల సీఐ కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి సైబర్ క్రైమ్, గంజాయి నిర్మూలన, ట్రాఫిక్ నియమాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి తో పాటు,సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి తో పాటు, కానిస్టేబుల్ నాగరాజు, రాజలింగంపేట గ్రామ సర్పంచ్ చారి, ఉపసర్పంచ్ రాజు, నీరటి మల్లేశం, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## యువత ఆరోగ్యమే సమాజ బలం



**క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి, గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**

**నాగర్ కర్నూల్ మే 18 (వుదయం ప్రతినిధి)**

యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే సమాజం బలంగా నిలుస్తుందని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కనీసం కొంత సమయాన్ని వ్యాయామం, నడక, యోగా వంటి కార్యక్రమాలకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,సూచించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో క్రీడలు, యువత ఆరోగ్యం అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ జిల్లా యువజన క్రీడల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాగర్ కర్నూల్ పట్టణంలో యోగా, "ఆరోగ్య తెలంగాణ" కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తొలి రోజు ఉదయం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో "ఫిట్ అండ్ యాక్టివ్ 2K రన్" కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. నాగర్ కర్నూల్ క్రీడా మైదానం నుంచి కేసరి సముద్రం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన 2కే రన్‌లో కలెక్టర్ యువత, అధికారులతో కలిసి, పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, యువత శక్తి, క్రీడా సంస్కృతి అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆధునిక జీవనశైలిలో వ్యాయామం, క్రీడలు తగ్గిపోతున్న నేపథ్యంలో యోగా, నడక, పరుగులు వంటి అలవాట్లను ప్రతిరో యాక్టివ్ 2K రన్" వంటి కార్యక్రమాలు కేవలం ఒకరోజు కోసం కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి వారి భవిష్యత్తు నిర్మాణానికి దోహదం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు కృషి చేస్తోందన్నారు.కలెక్టర్ స్వయంగా యోగా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు, యువతకు ప్రేరణ గా నిలిచారు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన యోగా కార్యక్రమంలో వివిధ ఆసనాలు, శ్వాస వ్యాయామాలను పతంజలి యోగ గురువు ఆధ్వర్యంలో ప్రదర్శించారు.కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, ఆర్టీవో సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మే 22న 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశం

**అధికారులకు జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఆదేశం**
**ఐడీఓసీలో ముమ్మరంగా ఏర్పాట్ల సమీక్ష**



**సిద్దిపేట, మే 18 ( వుదయం బ్యూరో)**

ఈనెల 22వ తేదీన సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇప్పటికే గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి సమావేశాలు విజయవంతంగా పూర్తయ్యాయని, వచ్చే శుక్రవారం (మే 22న) నిర్వహించే జిల్లా స్థాయి ముగింపు సమావేశానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. సమావేశానికి తరలివచ్చే ప్రజలకు, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ తదితర కనీస వసతులను కల్పించాలి. సభా ప్రాంగణంలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రతిబింబించేలా ఆయా శాఖల వారీగా స్టాళ్లను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న క్రింది పథకాల వివరాలను, లబ్ధిదారుల డేటాను శాఖల వారీగా సిద్ధం చేసుకోవాలి అన్నారు . ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహ జ్యోతి, రైతు బీమా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సన్నరకం వడ్లకు ప్రోత్సాహకం, ఆసరా పింఛన్లు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారితో వేదికపై మాట్లాడించేందుకు, వారి అనుభవాలను పంచుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మతో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది: జిల్లా కలెక్టర్



**వనపర్తి మే 18 (వుదయం ప్రతినిధి)**

క్రీడల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తూ... క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న యూత్ మరియు స్పోర్ట్స్ వారోత్సవాల సందర్భంగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వనపర్తిలో 2కే రన్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ 2కే రన్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్యఅతిథిగా హాజరై అదనపు ఎస్పీ రాజేష్ మీనాతో కలిసి జెండా ఊపి రన్ ప్రారంభించారు. బాలుర జూనియర్ కళాశాల మైదానం నుంచి బస్ డిపో మీదుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు ఈ 2కే రన్ సాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 99 డేస్ ప్రజా పాలనలో భాగంగా యువజన మరియు క్రీడల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడల పట్ల ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తూ, క్రీడల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు ఒక భాగంగా మారాలని సూచించారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉంటే మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉంటామని, అందరూ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వనపర్తి జిల్లాలో బాక్సింగ్ స్పోర్ట్స్ క్యాంప్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఏ ఎస్పి రాజేష్ మీనా మాట్లాడుతూ క్రీడలను అలవాటు చేసుకోవడం వల్ల శారీరకంగా దృఢంగా ఉండడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫిట్నెస్ కలిగి ఉండాలని తద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోగలమని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న యువజన మరియు క్రీడల వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యూత్ మరియు స్పోర్ట్స్ వీక్, టూరిజానికి సంబంధించిన పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. యూత్ మరియు స్పోర్ట్స్ వారోత్సవాల్లో భాగంగా ఈ వారం ప్రతిరోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తెలిపారు. యువతలో స్కిల్ డెవలప్మెంట్, యూత్ పార్లమెంట్, స్వచ్ఛదనం మరియు పచ్చదనం, వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న యువతకు సన్మాన కార్యక్రమాలు వంటివి వారోత్సవాల రోజువారి కార్యక్రమాల్లో భాగంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ బాలాజీ నాయక్, అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి




**యోగ, వ్యాయామం మన జీవితంలో ఒక భాగం కావాలి**
**పిలుపునిచ్చిన అదనపు కలెక్టర్ నర్సింగరావు**

**గద్వాల మే 18 (వుదయం ప్రతినిధి)**

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, యోగ, వ్యాయామం ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా యువజన, క్రీడల, టూరిజం శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూత్, టూరిజం వీక్ సెలబ్రేషన్స్ ను సోమవారం గద్వాల ఇండోర్ స్టేడియం వద్ద ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ నర్సింగరావు 5కే, 2కె మారథాన్, వాక్ థాన్, హెరిటేజ్ వాక్ లను జెండా ఊపి ప్రారంభించారు. పట్టణ ప్రధాన రహదారుల మీదుగా నిర్వహించిన ఈ వాక్ లో విద్యార్థులు, క్రీడాకారులు, యువత, వ్యాయామ ఉపాధ్యాయులు, పలువురు విశ్రాంత ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే వివిధ శాఖల ఆధ్వర్యంలో సంబంధిత వారోత్సవాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇందులో యూత్ వీక్ సెలబ్రేషన్స్ ప్రధానమైనవని, వారం పాటు నిర్వహించే కార్యక్రమాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పేర్కొన్నారు. స్టేడియం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, వివిధ క్రీడా సంఘాల ఆధ్వర్యంలో స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకొని, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మనిషి ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. మన శరీరం నియంత్రణలో ఉండేందుకు యోగ, వ్యాయామాన్ని కూడా ప్రతిరోజు చేస్తుండాలని సూచించారు. పౌష్టికాహారం, తగినంత నిద్ర, మంచి అలవాట్లు కూడా మనిషి ప్రశాంత జీవనం గడపడానికి ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని, సెల్ ఫోన్స్ చూడడం తగ్గిస్తే మంచి పౌరులుగా ఎదగవచ్చన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, ఎస్ జిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, యువత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు పండించిన పంటను ఇబ్బంది లేకుండా కొనాలి



**అదనపు కలెక్టర్ మధు మోహన్**
**అలంపూర్ మే 18 (వుదయం ప్రతినిధి)**

రైతులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా రైతులు పండించిన మొక్కజొన్నను కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ మధు మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం అలంపూర్ మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని, మార్కెట్ యార్డు గోదాములోని నిల్వ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోళ్ల వివరాలు సంబంధిత అధికారులు, రైతులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, రైతులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. మార్కెట్కు వచ్చిన మొక్కజొన్న కొనుగోలు చేయటంతో పాటు కొనుగోలు చేసిన మొక్కజొన్న వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

## ఎస్ఐహెచ్ఎంకు పూర్వ వైభవం తీసుకువస్తాం: మంత్రి జూపల్లి కృష్ణారావు



**జహీరాబాద్‌లో ఘనంగా పర్యాటక వారోత్సవాలు**
**బేకరీ కోర్సులు, నిథమ్‌లో బీబీఏ, ఎంబీఏ అడ్మిషన్ల ప్రారంభం**
**పేద విద్యార్థులకు స్టైఫండ్ అందించేందుకు ప్రభుత్వం కృషి**
**సంగారెడ్డి, మే 18:- వుదయం జిల్లా ప్రతి నిది జహీరాబాద్**

లోని స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం) సంస్థకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సంస్థను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడానికి రూ.5 కోట్లు మంజూరు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఎస్ఐహెంలో నిర్వహించిన పర్యాటక వారోత్సవాలను మంత్రి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ప్రారంభించిన బేకరీ, కన్ఫెక్షనరీ కోర్సులను ఆయన ప్రారంభించారు. అలాగే నిథమ్ (NITHM) విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ, ఎంబీఏ కోర్సుల అడ్మిషన్లను లాంఛనంగా ప్రారంభించి, పర్యాటక శాఖ రూపొందించిన 'టూరిస్ట్ గైడ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు.గ్రామీణ యువతకు స్వయం ఉపాధే లక్ష్యంఅనంతరం జరిగిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, సుదీర్ఘకాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెంను తిరిగి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించి, వారిని స్వయం ఉపాధి వైపు నడిపించాలనే ఉద్దేశంతో ఈ సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎస్ఐహెంలో చేరే పేద విద్యార్థులకు ఆర్థిక భారం లేకుండా స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని హామీ ఇచ్చారు. హాస్పిటాలిటీ రంగంలో అపార అవకాశాలుసాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో ప్రపంచం చిన్నదైపోయిందని, ప్రైవేట్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా పర్యాటక, హాస్పిటాలిటీ రంగాల్లో యువతకు మంచి భవిష్యత్తు ఉందన్నారు.విద్యార్థులు కేవలం కోర్సులకే పరిమితం కాకుండా భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, విదేశీ భాషలను కూడా నేర్చుకోవాలని సూచించారు. కాలానుగుణంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆధునిక కోర్సులను కరిక్యులమ్‌లో చేర్చాలని నిథమ్ డైరెక్టర్ వెంకటరమణకు సూచించారు.

పిల్లలు ఉపాధి ప్రధానమైన కోర్సులు అభ్యసించేందుకు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణీ ప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్‌పంకజ్, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, మాజీమంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్యాటక చారిత్రక పరిశోధన కేంద్రంగా మూడు మాల్ నిలువురాళ్ళు



**నిలువు రాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ**
**జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**
**నారాయణపేట మే18(వుదయం ప్రతినిధి)**

ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణమని నారాయణపేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమల్ నిలువు రాళ్ల (మెన్హిర్స్) ను ఆమె సందర్శించారు.

నిలువు రాళ్లు, సప్తర్షి మండలంతో ఖగోళ పరిజ్ఞానాన్ని, కాలాలను, వాతావరణ మార్పులను ఆనాడే తెలుసుకునేవారని, కాలాలను గుర్తించడానికి ఆది మానవులు నిలువురాళ్లను ఓ క్రమంలో ఏర్పాటు చేసినట్లు ఆర్కియాలజీ శాఖకు చెందిన అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఎలాంటి సాంకేతికత లేని 4 వేల సంవత్సరాల క్రితమే రాళ్ల ద్వారా తెలుసుకోవడం అనేది అబ్బురపరిచేలా, అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు యువజన క్రీడా,పర్యాటక వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఆమె సూచించారు. రాష్ట్ర పర్యాటక శాఖ కు సంబంధించిన వారోత్సవాల టూరిస్ట్ గైడ్ పోస్టర్ తో పాటు మూడ్ మల్ నిలువు రాళ్ళ విశిష్టత ను తెలిపే ప్రచార పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీ ఆర్ వో రషీద్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేశ్ శెట్టి, మూడ్ మల్ సర్పంచి, పురావస్తు శాఖ అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలి



**అడిషనల్ కలెక్టర్ సంగీత**
**సంగారెడ్డి, మే 18:--వుదయం.**

ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు దృష్టిసారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాల్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలోఅదిషనల్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 80 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్ కు 38, సంగారెడ్డి డివిజన్‌కు 12, ఆందోల్ డివిజన్‌కు 03, నారాయణఖేడ్ డివిజన్‌కు 19, జహీరాబాద్ డివిజన్‌కు 08 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు .ఈ కార్యక్రమం లో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు,, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భౌతిక శాస్త్రంలో రవి వర్మకు పీహెచ్.డీ.



**పటాన్చెరు (వుదయం):**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, భౌతిక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఐ.ఎస్. రవి వర్మ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'నానోకాంపోజిట్ పాలిమర్ బ్లెండ్ ఎలక్ట్రోలైట్లలో సోడియం అయాన్ ప్రసరణ యంత్రాంగం యొక్క అధ్యయనం' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ భౌతిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రమేష్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ రవి వర్మ పరిశోధన తదుపరి తరం శక్తి నిల్వ వినియోగం కోసం అధునాతన నానోకాంపోజిట్ పాలిమర్ ఎలక్ట్రోలైట్ ఫిల్మ్ ల అభివృద్ధిపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనంలో లవణం, ఇథలీన్ కార్బోనేట్ ప్లాస్టిసైజర్, నానోఫిల్లర్ ను చేర్చిన పాలిమర్ బ్లెండ్ ఎలక్ట్రోలైట్ వ్యవస్థను సంశ్లేషణ చేయడం ద్వారా గది ఉష్ణోగ్రత వద్ద మెరుగైన అయానిక వాహకతను సాధించారన్నారు.ఈ పరిశోధనలో, ఎలక్ట్రోకెమికల్ ఇంపిడెన్స్ స్పెక్ట్రోస్కోపీ వంటి అధునాతన లక్షణీకరణ పద్ధతులను ఉపయోగించి, అభివృద్ధి చేసిన ఫిల్మ్ ల యొక్క నిర్మాణాత్మక, విద్యుత్, విద్యుద్వాహక, విద్యుత్ రసాయన ధర్మాలను అన్వేషించినట్టు తెలిపారు. సురక్షితమైన, అధిక పనితీరు గల సాలిడ్‌స్టేట్ సోడియంఅయాన్ బ్యాటరీలు, పునరుకెపాసిటర్లు, ఫ్యూయల్ సెల్స్, ఎలక్ట్రోక్రోమిక్ పరికరాలు, ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్ లో ఈ పదార్థాన్ని ఉపయోగించడానికి బలమైన సామర్థ్యం ఉందని ఈ పరిశోధన ఫలితాలు నిరూపిస్తున్నాయని వివరించారు.భవిష్యత్ శక్తి సాంకేతికతల కోసం సమర్థవంతమైన, సుస్థిరమైన సాలిడ్‌స్టేట్ ఎలక్ట్రోకెమికల్ పరికరాల అభివృద్ధికి ఈ అధ్యయనం గణనీయంగా దోహదపడుతుందని భావిస్తున్నామన్నారు.డాక్టర్ రవి వర్మ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ టి.విశ్వం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఘనంగా ముగిసిన విద్యా వారోత్సవాలు




**నాగర్ కర్నూల్ మే 18 (వుదయం ప్రతినిధి)**

విద్యా వారోత్సవాలుజిల్లా వ్యాప్తంగా మే 11 నుండి 17 వరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన "విద్యా వారోత్సవాలు" ఆదివారం కలెక్టరేట్ లోని IDOC సమావేశ మందిరంలో జరిగిన "విద్యా విజయోత్సవం" కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి.ఈ సందర్భంగా జిల్లా విద్యా శాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం, ప్రభుత్వ పాఠశాలలలో నమోదు పెంపు, బోధన నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యా రంగ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను అమలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.విద్యా విజయోత్సవం సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కూడా సత్కరించి అభినందించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు మాట్లాడుతూ...., గత సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాను రెండో స్థానంలో నిలిపినందుకు జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ ని మరియు విద్యాశాఖ యంత్రాంగాన్ని అభినందించారు. వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాలు కార్పొరేట్ స్థాయికి ఎదిగేలా అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఫలితాల సాధనకు అనుసరించిన వ్యూహాలను మరింత బలోపేతం చేసి వచ్చే సంవత్సరం రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించగా, రెండవ రోజు పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం రెండు పాఠశాలల్లో రెమెడియల్ తరగతులు ప్రారంభించారు. మూడవ రోజు నియోజకవర్గ స్థాయిలో సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు విద్యాశాఖపై అవగాహన సదస్సులు నిర్వహించారు. నాలుగవ రోజు బడిబాట కార్యక్రమం, మెగా PTM ద్వారా విద్యార్థుల నమోదు పెంపు చర్యలు చేపట్టారు. ఐదవ రోజు లైబ్రరీ డే, ఆరవ రోజు కళావైభవం (సాంస్కృతిక కార్యక్రమాలు) నిర్వహించగా, ఏడవ రోజు విద్యా విజయోత్సవం ఘనంగా నిర్వహించి వారోత్సవాలను ముగించారు.కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, పరీక్షల విభాగం అధికారి రాజశేఖర్ రావు, సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు విద్యాశాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ విద్యాశాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.


## క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలి




**మేయర్ జి మమత**
**మహబూబ్ నగర్**
**మే18(వుదయం ప్రతినిధి)**

ప్రజాపాలన - ప్రజా ప్రణాళిక 99 డేస్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ,స్పోర్ట్స్ వీక్ 5 కిలోమీటర్ మారథాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా 5 కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నందుకు నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ కనీసం ఒక గంట పాటు వ్యాయామం, వాకింగ్ వంటి పనులను దినచర్యలో భాగంగా చేసుకోవాలని వారు సూచించారు. యువత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, తమలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని, తద్వారా సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.స్టేడియం కోచ్‌లు, క్రీడాకారులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని మారథాన్‌ను విజయవంతం చేశారు. కార్యక్రమంలో డి వై ఎస్ ఓ జె. రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీవో కరుణశ్రీ , ఎం ఈ ఓ కృష్ణయ్య , మేయర్ భర్త కోట నాయక్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## షాది వేడుకలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌస్ కుమార్తె నిఖా వేడుక సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ ఉపాధ్యక్షురాలు ఎం లావణ్య రెడ్డి, నిజాంపేట్ మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, చైర్మన్ పల్లె. జితేందర్ గౌడ్, సొసైటీ చైర్మన్ లు బాపు రెడ్డి,బాదే.చంద్రం మాజీ కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్,నాయకులు రంజిత్ గౌడ్, సదా శివ లింగం,శ్రీకాంత్ గౌడ్, నగేష్,విజయ్, ఎల్లం యాదవ్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు

## ప్రుడెన్షియల్ చేతికి భారతీ లైఫ్

భారతీ లైఫ్ ఇన్సూరెన్స్‌లో మెజారిటీ (75%) వాటాను యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రుడెన్షియల్ పీఎల్‌సీ కొనుగోలు చేయనుంది. భారతీ లైఫ్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, 360 వన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల నుంచి ఈ వాటాను రూ.3,500 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు ప్రుడెన్షియల్ ఆదివారం తెలిపింది. ఇప్పటికే ఐసీఐసీఐ బ్యాంక్‌తో కలిసి ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ సంస్థను 22% వాటాతో ప్రుడెన్షియల్ నిర్వహిస్తోంది. ఇప్పుడు మరో జీవిత బీమా సంస్థలో మెజారిటీ వాటాను కొనుగోలు చేస్తున్నందున, పాత సంస్థలో వాటాను 10% లోపునకు ప్రుడెన్షియల్ పరిమితం చేసుకోవాల్సి వస్తుంది.




# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను దాటేసిన ఎయిర్‌టెల్


టెలికాం సర్వీస్ ప్రొవైడర్ భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువపరంగా రెండో అతిపెద్ద కంపెనీగా అవతరించింది. ప్రైవేటురంగానికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానానికి చేరుకుంది. సోమవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో భారతీ ఎయిర్‌టెల్ షేర్లు రాణించడంతో ఇంట్రాడేలో మార్కెట్ విలువ రూ.11.90 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.11.80 లక్షల కోట్లుగా ఉంది. రూ.18.11 లక్షల కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నాలుగు రోజులుగా రాణిస్తున్నాయి. సోమవారం కూడా మరో 3 శాతం రాణించడంతో ఈ ఫీట్ సాధ్యమైంది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూ.1,904.60 వద్ద ముగిసిన ఎయిర్‌టెల్ షేరు విలువ.. నేడు 1,953.80 వద్ద గరిష్ఠాన్ని తాకింది. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో 11 శాతం మేర లాభపడింది. ఏప్రిల్‌లో 6శాతం, మే నెలలో 3 శాతం చొప్పున ఎయిర్‌టెల్ షేరు విలువ పెరిగింది. గతేడాది నవంబర్ 21న రూ.2,174 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకిన షేర్లు.. ఈ ఏడాది రూ.1,745 వద్ద 52 వారాల కనిష్ఠానికి చేరడం గమనార్హం. ఇటీవల ఎయిర్‌టెల్ మెరుగైన త్రైమాసిక ఫలితాలను ప్రకటించగా.. హెచ్‌డీఎఫ్‌సీ మాత్రం స్థిరమైన లాభాలను పోస్ట్ చేసింది. ఈ క్రమంలోనే ఎయిర్‌టెల్ షేర్లు రాణిస్తున్నాయి.





# ప్రారంభ స్థాయి ఉద్యోగుల స్థానంలో ఏఐ

కంపెనీల్లో సాధారణ కార్యకలాపాలను కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత టూల్స్ పూర్తి చేస్తుండటంతో, ప్రారంభ స్థాయి ఉద్యోగ నియామకాలు తగ్గిపోతున్నాయి. కంపెనీల నియామకాల విధానంలో భారీ మార్పులకు ఇది కారణమవుతోంది. ఆలివర్ వైమాన్ ఫోరమ్, న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీ నిర్వహించిన అంతర్జాతీయ సర్వే ప్రకారం.. 'తాజా ఉత్తీర్ణులను తీసుకోవడం తగ్గించి, అనుభవజ్ఞులైన ఉద్యోగుల నియామకాలపై దృష్టి పెట్టాలని' ప్రపంచ వ్యాప్తంగా దాదాపు సగం మంది సీఈఓలు యోచిస్తున్నారు. పలు రంగాల పరిశ్రమలు, ప్రాంతాలకు చెందిన 415 మంది చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా, 2026 సీఈఓ సర్వే నివేదికను రూపొందించారు. దీని ప్రకారం 43% మంది సీఈఓలు రాబోయే రెండేళ్లలో జూనియర్ స్థాయి కొలువులను తగ్గించాలని భావిస్తున్నారు. 2025లో ఇలా భావించిన వారి సంఖ్య 17 శాతంగా ఉంది. 33% మంది సీఈఓలు మధ్య స్థాయి ఉద్యోగాల భర్తీపై ఎక్కువ దృష్టి పెడుతుండగా, 10% మంది సీనియర్ ఉద్యోగుల నియామకానికి మొగ్గు చూపుతున్నారు.

ఫ్రెషర్లు, జూనియర్ ఉద్యోగులకు ఇచ్చే రొటీన్ పనులను, కంపెనీలు ఏఐ టూల్స్ సాయంతో నిర్వహించగలుగుతున్నాయి. కోడింగ్ రాయడం, డాక్యుమెంట్లను విశ్లేషించడం నుంచి కస్టమర్ సపోర్ట్, నివేదికను రూపొందించడం వంటి పనుల కోసం ఇప్పుడు ఏఐను ఎక్కువగా వినియోగిస్తున్నారు. నిర్ణయాలు తీసుకోవడం, వ్యూహాత్మక ఆలోచనలు, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవడంలో ఏఐ ఇంకా సఫలం కావడం లేదు. ఈ పనులకు అనుభవజ్ఞులైన ఉద్యోగుల అవసరం ఉందని ఎగ్జిక్యూటివ్‌లు భావిస్తున్నారు. ప్రాక్టికల్ అనుభవాన్ని, విమర్శనాత్మక ఆలోచనను ఏఐ టూల్స్‌తో భర్తీ చేయడం కష్టమని కంపెనీలు గుర్తిస్తున్నాయి. రాబోయే 1–2 ఏళ్లలో ఉద్యోగుల సంఖ్య స్థిరంగా లేదా మార్పులేకుండా ఉంటుందని 45% మంది సీఈఓలు అంచనా వేస్తున్నారు. 25% మంది మాత్రం సిబ్బందిని 5% కంటే ఎక్కువ తగ్గించాలని అనుకుంటున్నారు. మొత్తంగా చూస్తే 75% మంది సీఈఓలు.. నియామకాలను నిలిపివేయడం లేదా సిబ్బందిని తగ్గించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఏఐ ద్వారా మంచి ప్రతిఫలాలను పొందుతున్న కొన్ని కంపెనీలు మాత్రం, ఆయా నైపుణ్యాలు కలిగిన యువ ప్రతిభపై నమ్మకం ఉంచుతున్నాయి. ఇటువంటి కంపెనీల్లో 24% మంది సీఈఓలు తాము జూనియర్ ఉద్యోగులకు మొగ్గుచూపుతున్నట్లు తెలిపారు. ఏఐ ద్వారా ఆశించిన స్థాయిలో లాభాలు పొందలేకపోతున్న కంపెనీల్లో ఈ సంఖ్య 17 శాతంగా ఉంది.




## భారీ నష్టాల నుంచి కోలుకున్న సూచీలు



ముంబయి: అంతర్జాతీయంగా పెరిగిన చమురు ధరలు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ మొదలు కావొచ్చన్న భయాలు, రూపాయి విలువ పతనం వంటి కారణాలతో ఈ ఉదయం భారీ నష్టాలు చవిచూసిన సూచీలు.. తర్వాత కోలుకున్నాయి. ఐటీ స్టాక్స్ అండతో నష్టాలను అధిగమించాయి. సెన్సెక్స్ స్వల్ప లాభాల్లో ముగియగా.. నిఫ్టీ ఫ్లాట్‌గా స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 74,807.97 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,237.99) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో దాదాపు వెయ్యికి పైగా పాయింట్ల నష్టంతో 74,180.26 వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఆపై క్రమంగా కోలుకున్న సూచీ.. చివరికి 77.05 పాయింట్ల లాభంతో 75,315.04 వద్ద ముగిసింది. నిఫ్టీ 6.45 పాయింట్ల లాభంతో 23,649.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.33గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, సన్‌ఫార్మా షేర్లు లాభపడ్డాయి. టాటా స్టీల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ, మారుతీ సుజుకీ కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 111 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4541 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## రత్నాభరణాల ఎగుమతుల్లో 9% క్షీణత



ఏప్రిల్‌లో మన దేశం నుంచి రత్నాభరణాల ఎగుమతులు 2.226.45 మిలియన్ డాలర్లు (రూ.20,825.01 కోట్ల)కు పరిమితమయ్యాయి. 2025 ఏప్రిల్ ఎగుమతులు 2,448.53 మిలియన్ డాలర్ల (రూ.20,952.26 కోట్ల) కంటే ఇవి 9.07% తక్కువ. పశ్చిమాసియా సంక్షోభ పరిణామాలే ఇందుకు కారణమని రత్నాభరణాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) ఛైర్మన్ కిరిట్ భన్సాలీ వెల్లడించారు. ఏడాది క్రితంతో పోలిస్తే.. కట్ అండ్ పాలిష్ వజ్రాల ఎగుమతులు 1,108.74 మి.డాలర్ల నుంచి 19.65% తగ్గి 890.91 మిలియన్ డాలర్లకు చేరాయి. ల్యాబ్‌లో అభివృద్ధి చేసిన వజ్రాల ఎగుమతు లు 110.43 మి.డాలర్ల నుంచి 15.53% క్షీణించి 93.28 మి.డాలర్లకు పరిమితమయ్యాయి. పసిడి ఆభరణాల ఎగుమతులు 1075.67 మి.డాలర్ల నుంచి 21.77% తగ్గి 841.54 మి.డాలర్లుగా నమోదయ్యా యి. ప్లెయిన్ గోల్డ్ ఆభరణాలు 644.33 మి.డాలర్ల నుంచి 47.06% క్షీణించి 341.08 మి.డాలర్లకు చేరాయి.

# దేశీయ తయారీ ఐఏఎఫ్ సీ-295 సిద్ధం

భారత రక్షణ రంగ తయారీలో మరో కీలక ముందడుగు పడింది. దేశీయంగా అసెంబుల్ చేసిన సైనిక రవాణా వాహనం ఎయిర్‌బస్ సీ–295 విమానం ప్రస్తుతం పరీక్షలకు సిద్ధమైంది. గుజరాత్ వడోదరాలోని టాటా– ఎయిర్‌బస్ ప్లాంట్‌లో ఈ విమానాన్ని రూపొందించారు. 'భారత్‌లో తయారీ' కార్యక్రమంలో ఈ ప్రాజెక్టు కీలకం. తద్వారా సీ–295 ప్లాట్‌ఫామ్‌కు ప్రపంచంలో అతిపెద్ద వినియోగదారుగా భారత్ అవతరించింది. భారత వాయు దళం (ఐఏఎఫ్) డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ మార్షల్ అవధేష్ కుమార్ భారతి ఇటీవల వడోదరా ప్లాంట్‌లోని ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను సందర్శించి, అక్కడ రూపొందిన సీ–295 విమానం పురోగతిని సమీక్షించారు. ఈ విమానంపై క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించనున్నారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), ఎయిర్‌బస్ మధ్య కుదిరిన ఇండియా– స్పెయిన్ సీ–295 కార్యక్రమంలో భాగంగా, 2024 అక్టోబరు 28న వడోదరా ప్లాంట్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి ప్రారంభించారు. 56 సీ–295 విమానాల కోసం స్పెయిన్‌తో రూ.21,935 కోట్ల ఒప్పందాన్ని మనదేశం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం.. 16 విమానాలను నేరుగా ఎగిరే స్థితిలో మన దేశానికి ఎయిర్‌బస్ సరఫరా చేస్తుంది. మిగిలిన 40 విమానాలను మనదేశంలోనే అసెంబ్లింగ్ చేస్తున్నారు. ప్రతి సీ–295 విమానంలో భారత్ ఎలక్ట్రానిక్స్, భారత డైనమిక్స్ అభివృద్ధి చేసిన దేశీయ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్ అమర్చుతున్నారు. ఐఏఎఫ్ దగ్గర ఉన్న ఆవ్రో–748 విమానాలను, ఎయిర్‌బస్ సీ–295 విమానాలు భర్తీ చేయనున్నాయి. సైనికుల తరలింపు, సరకుల రవాణా, వైద్య అవసరాలు, ప్రత్యేక ఆపరేషన్‌ల కోసం ఈ విమానాలను వినియోగిస్తారు. ఈ విమానం గరిష్ఠంగా 70 మంది సైనికులను, 48 మంది పారా ట్రూపర్లు, 28 మెడికల్ స్ట్రెచర్‌లను తీసుకెళ్లగలదు. రెండు ప్రాట్ అండ్ విట్నీ పీడబ్ల్యూ 127జీ టర్బోప్రాప్ ఇంజిన్లతో ఈ విమానం నడుస్తుంది. తక్కువ దూరం నుంచి టేకాఫ్, ల్యాండింగ్ అయ్యే సామర్థ్యం దీనికి ఉంది. దీంతో సుదూర, పర్వత ప్రాంతాలతో సహా కఠిన ప్రాంతాల్లో, చిన్న రన్‌వేల నుంచి వీటిని నిర్వహించొచ్చు.



అంతరిక్షం ద్వారా ఇంటెలిజెన్స్ కార్యకలాపాలు నిర్వహించేందుకు అనువైన చిన్న శాటిలైట్లను, రక్షణ రంగం కోసం మనదేశంలో తయారు చేయనున్నారు. ఇలాంటి శాటిలైట్ల తయారీలో అంతర్జాతీయంగా ప్రాచుర్యం కలిగిన ఈసీఈవైఈ సంస్థ సీఈఓ రఫాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆసియా–పసిఫిక్ ప్రాంతానికి అవసరమైన శాటిలైట్లను భారత్‌లో రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ తయారీ కార్యకలాపాలను ఏడాది వ్యవధిలోనే చేపడతామని పేర్కొన్నారు. శాటిలైట్లతో పాటు భూమిమీద ఏర్పాటు చేయాల్సిన వ్యవస్థలనూ అందిస్తామన్నారు. ఏడాదికి 10 శాటిలైట్లతో ప్రారంభించి, క్రమంగా 20–40కి చేర్చాలన్నది లక్ష్యంగా పేర్కొన్నారు. అంతర్జాతీయంగా తాము ఏడాదికి 50 శాటిలైట్లు తయారు చేస్తున్నట్లు తెలిపారు. పోలాండ్, స్పెయిన్, యూకే, ఆస్ట్రేలియా, జపాన్, యూఏఈ, గ్రీస్, అమెరికాల్లో కలిపి 1,000 మందికి పైగా నిపుణులున్నారని వివరించారు.




## పోరాడి ఓడిన సాత్విక్ జోడీ




థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో స్టార్ భారత జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్నారు. గొప్పగా పోరాడినప్పటికీ ఫైనల్లో ఈ జంట 12–21, 23–25తో ఇండోనేషియాకు చెందిన లియో రోలీ కర్నాండో, డేనియల్ మార్టిన్ జోడీ చేతిలో ఓడిపోయింది. భారత జోడీ నాలుగు ఛాంపియన్‌షిప్ పాయింట్లను కాచుకున్నా.. చివరికి పరాజయం తప్పలేదు. సాత్విక్, చిరాగ్ ద్వయం తొలి గేమ్‌లో పూర్తిగా తేలిపోయింది. ఆరంభంలో 1–4తో వెనుకబడ్డ ఈ జోడీ ఆ తర్వాత 8–13తో నిలిచింది. ఆధిక్యాన్ని కొనసాగించిన ప్రత్యర్థి జంట పెద్దగా ప్రతిఘటన ఎదుర్కోకుండానే మొదటి గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లో మార్టిన్ స్మాష్‌లతో విరుచుకుపడడంతో ఇండోనేషియా జంట 5–3తో ఆధిక్యంలోకి వెళ్లింది. పుంజుకున్న సాత్విక్, చిరాగ్ ద్వయం 7–5తో ఆధిక్యం సంపాదించింది.

# ఇలాంటప్పుడు ధోని రిస్క్ చేయడు: సునీల్ గావస్కర్



ఒకవైపు ప్లేఆఫ్స్‌కు కీలక పోరు.. మరోవైపు దాదాపు ఏడాది పాటు ఆటకు దూరమైన క్రికెటర్ పునరాగమనంపై ఊహాగానాలు.. ఇదీ ప్రస్తుతం చెన్నై సూపర్ కింగ్స్ పరిస్థితి! 12 మ్యాచుల్లో ఆరు విజయాలు సాధించిన సీఎస్‌కే.. మిగిలిన రెండింట్లో గెలిస్తే నాకౌట్‌కు చేరుకోవచ్చు. ఈ క్రమంలో చెపాక్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో నేడు తలపడనుంది. ఇప్పటివరకు మైదానంలోకి అడుగు పెట్టని ఎంఎస్ ధోని వస్తాడని అంతా భావిస్తున్నారు. ఇక్కడే రిటైర్‌మెంట్ ప్రకటన చేస్తాడని జోరుగా చర్చ జరుగుతోంది. అయితే, ఇలాంటి కీలక సమయంలో ధోని ఆడకపోవచ్చని.. సీఎస్‌కే జట్టు కూర్పును మార్చే అవకాశం లేదని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ ధోని బరిలోకి దిగితే మాత్రం అది సర్‌ప్రైజే అవుతుందంటూ వ్యాఖ్యానించాడు. "ధోని పునరాగమనం చాలా కష్టమైంది. అతడు దాదాపు ఏడాది నుంచి క్రికెట్ ఆడటం లేదు. ప్రాక్టీస్ చేస్తున్నాడు. కానీ, రియల్‌టైమ్ గేమ్ ఆడలేదు. ఇప్పుడు సీఎస్‌కేకు చాలా కఠినమైన సవాల్ ఎదురుగా ఉంది. ప్లేఆఫ్స్‌కు వెళ్లాలంటే సన్‌రైజర్స్‌పై విజయం సాధించాలి. ధోని జట్టు మనిషి. కాబట్టి, ఇలాంటి సమయంలో ఆడతాడని నేను అనుకోవడం లేదు. అభిమానిగా నేను కూడా ధోని ఆడకపోతే నిరుత్సాహ పడతా. అతడు మైదానంలో దిగితే ఎవరికి మాత్రం చూడాలని ఉండదు! కానీ, అతడు తన గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకున్నట్లు అనిపించలేదు" అని సునీల్ గావస్కర్ అన్నారు. మాజీ క్రికెటర్, సీఎస్‌కే తరఫున ఆడిన రవిచంద్రన్ అశ్విన్ కూడా ఇదే మాట చెప్పాడు. తుది జట్టుపైనా అశ్విన్ పోస్టు పెట్టాడు. వచ్చే సంవత్సరం ధోని వీడ్కోలు పలికే అవకాశం ఉన్నట్లు పరోక్షంగా ప్రస్తావిస్తూ.. "ఇవాళ్టి మ్యాచ్‌లో జరగకపోవచ్చు. 2027లో అయితే అవ్వొచ్చు. అలాగే సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌కు సంబంధించి బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎలాంటి మార్పులు ఉండవు. అకీల్ హుస్సేన్ తుది జట్టులోకి వస్తాడు" అని చెపాక్‌లో సీఎస్‌కే చివరి మ్యాచ్‌పై తన అంచనాను వెల్లడించాడు.

# దయచేసి ఆడు ధోని.. లేకపోతే నేనే ప్రేక్షకుల మధ్యలోకి తీసుకెళ్తా: హర్భజన్

ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు వచ్చేసింది. అయినా ఇప్పటివరకు ధోని ఆటను చూసే భాగ్యం అభిమానులకు దక్కలేదు. ఇవాళ చెపాక్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో చెన్నై తలపడనుంది. ఈ ఐపీఎల్‌లో హోం గ్రౌండ్‌లో చెన్నైకి ఇది చివరి మ్యాచ్. దీంతో ఈ మ్యాచ్‌లో ధోని బరిలోకి దిగి రిటైర్‌మెంట్ ప్రకటిస్తాడంటూ ప్రచారం జరుగుతోంది. సీఎస్కే తమ మిగిలిన రెండు మ్యాచుల్లోనూ గెలిస్తే ప్లే ఆఫ్స్‌కు చేరుకునే అవకాశముంది. దీంతో జట్టు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 'తలా' ఈ మ్యాచ్‌లో ఆడకపోవచ్చని సునీల్ గావస్కర్, రవిచంద్రన్ అశ్విన్, ఆకాశ్ చోప్రా వంటి మాజీ క్రికెటర్లు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ మాత్రం హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ధోని ఆడతాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఒకవేళ ధోని అలా చేయకపోతే తానే స్వయంగా అతనిని ప్రేక్షకుల మధ్యలోకి తీసుకెళ్తానంటూ సరదాగా వ్యాఖ్యానించాడు. 'చూడండి.. చెన్నైలో అభిమానుల ముందు తన చివరి మ్యాచ్ ఆడతానని అతడు చెప్పాడు. ఆ మాట నిలబెట్టుకునే సమయం ఇప్పుడు వచ్చేసింది. సొంత మైదానంలో సీఎస్కేకు ఇదే చివరి మ్యాచ్. 'తలా' బహుశా చివరిసారిగా బరిలోకి దిగడాన్ని మనం చూసే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. ఒకవేళ ఈ మ్యాచ్ ఆడకపోతే అతను వచ్చే ఏడాది మళ్లీ తిరిగి వస్తాడని అర్థం చేసుకోవాలి. అతని విషయంలో ఏం జరుగుతుందో చెప్పలేం'' అని హర్భజన్ పేర్కొన్నాడు. ''దయచేసి ఆడు ధోని.. లేకపోతే నేను నిన్ను ప్రేక్షకుల మధ్యలోకి తీసుకెళ్తా'' అని భజ్జీ ఫన్నీగా అన్నాడు. హర్భజన్ కొన్నాళ్లు చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే.



# వైభవ్ మరింత మెరుగుపడాల్సి ఉంది: రాజస్థాన్ కోచ్ సంగక్కర

రాజస్థాన్ రాయల్స్ విజయాల కోసం ఇబ్బందిపడుతున్నా.. వైభవ్ సూర్యవంశీ మాత్రం బ్యాటింగ్‌లో అదరగొట్టేస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో రికార్డుల వర్షం కురిపిస్తున్నాడు. మరోవైపు జాతీయజట్టుకు ఎంపిక చేయాలనే డిమాండ్లూ ఎక్కువైపోయాయి. అయితే, అతడు ఇంకా మెరుగుకావాల్సిన అవసరం ఉందని రాజస్థాన్ కోచ్ కుమార్ సంగక్కర తెలిపాడు. మంచి ఆరంభాలను కొన్ని మ్యాచుల్లో భారీ స్కోర్లుగా మలచడంలో వైభవ్ ఇబ్బంది పడటం పైనా స్పందించాడు. 'నాకు ఆ విషయంలో ఎలాంటి ఆందోళన లేదు. విధ్వంసకరమైన ప్రారంభాలను ఇస్తున్నాడు. పవర్‌ప్లేలో ఆ మాత్రం దూకుడు ఉండాలి. చాలా త్వరగా 30ల్లోకి వచ్చేస్తాడు. ఆ తర్వాత వేగంగా ఆడే క్రమంలో పెవిలియన్ కు చేరుతున్నాడు. ఇదేమీ నన్ను కలవరానికి గురిచేయడం లేదు. తప్పకుండా ఈ విషయంలో అతడు ఇంకాస్త మెరుగుకావాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు అతడు వేగంగా చేసే 30 లేదా 40 పరుగులు కూడా జట్టుకు చాలా ఉపయోగపడతాయి. మా జట్టులో మరో ఆరేడుగురు దూకుడుగా ఆడే బ్యాటర్లు ఉన్నారు. ప్రత్యర్థిపై ఒత్తిడి కొనసాగించేందుకు ఈ స్టార్ట్ సరిపోతుంది'' అని కుమార సంగక్కర విశ్లేషించాడు. ఈ సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. అతడు 12 మ్యాచుల్లో 43 సిక్స్‌లు బాదాడు. రాజస్థాన్ రాయల్స్ ఇంకా రెండు లీగ్ మ్యాచులు ఆడాల్సిఉంది. దీంతో సిక్స్‌ల సంఖ్య అర్ధశతకం చేరుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ క్రమంలో అభిషేక్ శర్మ రికార్డును వైభవ్ అధిగమించాడు. అభిషేక్ 2024 సీజన్‌లో 42 సిక్స్‌లు కొట్టాడు. ఇప్పటివరకు ఇదే అత్యధికం. తాజాగా వైభవ్ ఆ ఘనతను తుడిచిపెట్టేశాడు. మరోవైపు ఈ ఎడిషన్‌లోనూ అభిషేక్ 37 సిక్స్‌లు కొట్టాడు. సన్‌రైజర్స్ కూడా ఇంకా రెండు లీగ్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. సిక్స్‌ల విషయంలో వీరిద్దరి మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. ముంబయి బ్యాటర్ రికెల్టన్ (37), కూపర్ కనోలీ (32) తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నారు.



# బీసీసీఐ ఆర్టీఐ పరిధిలోకి రాదు: కేంద్ర సమాచార కమిషన్

బీసీసీఐ.. ప్రభుత్వ యాజమాన్యంలో గానీ, నియంత్రణలో గానీ లేదని, ప్రభుత్వం నుంచి దానికి నిధులు అందవని కేంద్ర సమాచార కమిషన్ (CIC) వెల్లడించింది. ఆ లెక్కన బీసీసీఐ ఆర్టీఐ పరిధిలోకి రాదని స్పష్టం చేసింది. జాతీయ, అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌ల కోసం బీసీసీఐ భారత్‌కు ప్రాతినిధ్యం వహించడానికి, ఆటగాళ్లను ఎంపిక చేయడానికి గల నిబంధనలు, అధికారాలకు సంబంధించిన సమాచారాన్ని కోరుతూ దాఖలైన అప్పీల్‌ను కమిషన్ కొట్టివేసింది. బీసీసీఐ ప్రజా అధికార సంస్థ అని, ప్రజా సమాచార అధికారులను నియమించాలని 2018లో అప్పటి సమాచార కమిషనర్ ఎం. శ్రీధర్ ఆచార్యులు బోర్డును ఆదేశించారు. ఈ ఆదేశాన్ని బీసీసీఐ మద్రాస్ హైకోర్టులో సవాల్ చేసింది. సుప్రీం కోర్టు గతంలో వెలువరించిన తీర్పుల దృష్ట్యా ఈ అంశంపై మళ్లీ విచారణ చేపట్టాలని మద్రాస్ హైకోర్టు కేంద్ర సమాచార కమిషన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సీఐసీ.. బీసీసీఐ ఆర్టీఐ పరిధిలోకి రాదని తేల్చింది. 'బీసీసీఐ అనేది తమిళనాడు సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన ఒక సొసైటీ. ఇది రాజ్యాంగం ద్వారా గానీ, పార్లమెంటు చేసిన ఏ చట్టం ద్వారా గానీ ఏర్పాటు కాలేదు. ప్రభుత్వ యాజమాన్యం కింద గానీ, ప్రభుత్వ నియంత్రణలో గానీ ఇది లేదు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయమూ అందడం లేదు. అందువల్ల దానిని ఒక ప్రజా అధికార సంస్థ కింద పరిగణించలేం'' అని కేంద్ర సమాచార కమిషన్ స్పష్టం చేసింది.



# వుదయం సినిమా

MOVIE TIME!

## చిన్న హీరో – పెద్ద సహాయం

వుదయం సినిమా

నటుడు Sanjosh సేవా కార్యక్రమాలకు ప్రశంసలు BEWARS, SODHARA సినిమాలతో గుర్తింపు పొందిన యువ నటుడు Sanjosh తన SANJOSH FOUNDATION ఆధ్వర్యంలో 18052026న ఏటూరునాగారంలో ఘనంగా స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ములుగు జిల్లా మరియు గిరిజన ప్రాంతాలకు చెందిన 10వ తరగతిలో 500కు పైగా మార్కులు, ఇంటర్మీడియట్‌లో 900కు పైగా మార్కులు సాధించిన 118 మంది గిరిజన మరియు దిగువ మధ్యతరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి ₹2,000 చొప్పున నగదు స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహం అందించి, వారి భవిష్యత్తుకు తోడ్పాటు అందించారు.



## 'సెయాన్' షూటింగ్ నేడు ప్రారంభం




వుదయం సినిమా

వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్" ప్రాజెక్ట్ కోసం దర్శకుడు శివకుమార్ మురుగేశన్‌తో చేతులు కలిపారు. బాక్సాఫీస్ వద్ద ఘన విజయం అందుకున్న 'అమరన్' తర్వాత రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌లో శివకార్తికేయన్ చేస్తున్న చిత్రమిది. శివకార్తికేయన్ పుట్టినరోజున విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది.ఈ రోజు నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని మేకర్స్ ఓ ఇంటెన్స్ పోస్టర్ ద్వారా అధికారికంగా ప్రకటించారు. పోస్టర్‌లో శివకార్తికేయన్ రా అండ్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న ఆగ్రహం క్యారెక్టర్ పవర్ ని చూపిస్తున్నాయి. ఈ పోస్టర్ సినిమా ఆధ్యాత్మికతతో పాటు మాస్ యాక్షన్ ఎలిమెంట్స్‌ను కూడా కలిగి ఉంటుందనే సంకేతాలు ఇస్తోంది.ఈ చిత్రాన్ని భారీ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఎమోషన్స్, మాస్ అప్పీల్, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఎంటర్టైనర్ గా సినిమా రూపొందనుంది.ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. వివేక్ విజయ కుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, షాన్ లోకేష్ ఎడిటింగ్ చేస్తున్నారు. యాక్షన్ డైరెక్టర్‌గా సుప్రీమ్ సుందర్ పని చేస్తున్నారు.

## 'పెద్ది' ట్రైలర్ లాంచ్ ఈవెంట్

వుదయం సినిమా

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బుచ్చి బాబు సానా, వెంకట సతీష్ కిలారు, వృద్ధి సినిమాస్, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ 'పెద్ది' లార్జర్ దెన్ లైఫ్ ఎపిక్ ట్రైలర్ లాంచ్మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్-ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు ముందే సంచలనం సృష్టిస్తోంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను ముంబైలో జరిగిన ఈవెంట్ లో లాంచ్ చేశారు. రైల్వే ప్లాట్ ఫామ్‌లపై జరిగే భారీ ఘర్షణలు, గాల్లో ఎగిరే స్టంట్స్, మట్టిలో జరిగే కుస్తీ పోరాటాలు.. ప్రతి యాక్షన్ బ్లాక్ కొత్తగా కనిపిస్తోంది. ముఖ్యంగా క్రికెట్, కుస్తీని కలిపి డిజైన్ చేసిన యాక్షన్ సీక్వెన్స్ ట్రైలర్‌కే హైలైట్‌గా నిలిచింది.రామ్ చరణ్ ఈ సినిమాలో పూర్తిగా కొత్త అవతార్‌లో అదరగొట్టారు. ఆయన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్, బాడీ లాంగ్వేజ్, అథ్లెటిక్ ప్రెజెన్స్ అన్నీ కూడా పాత్రకు అద్భుతంగా సరిపోయాయి. ఒకవైపు ఫ్లడ్‌లైట్స్ కింద రఫ్ బ్యాట్‌తో క్రికెట్ ఆడే పెద్ది.. మరోవైపు మట్టిలో కుస్తీ పోరాటాల్లో దిగే పెద్ది.. ఈ రెండు షేడ్స్‌లో చరణ్ అద్భుతంగా కనిపించారు. ఇది కేవలం లుక్ మార్పు కాదు.. పూర్తిగా పాత్రలో లీనమై చేసిన పెర్ఫార్మెన్స్ అని ట్రైలర్ స్పష్టం చేసింది.జాన్వీ కపూర్ తన పాత్రలో ఎంతో నేచురల్‌గా కనిపించింది. గ్రామీణ యువతిగా ఆమె చూపించిన ఎక్స్‌ప్రెషన్స్ ట్రైలర్‌కు మంచి వార్మ్‌నెస్ తీసుకొచ్చాయి. అలాగే శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ పాత్రలు కూడా కథలో బలమైన ప్రాధాన్యం కలిగి ఉన్నాయని ట్రైలర్ సూచించింది.టెక్నికల్‌గా 'పెద్ది' మరో స్థాయిలో కనిపిస్తోంది. అవినాష్ కొల్లా రూపొందించిన పెద్ది ప్రపంచం అద్భుతంగా వుంది. రత్నవేలు సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు పెద్ద అసెట్‌గా నిలిచింది. ప్రతి ఫ్రేమ్‌లో రిచ్ విజువల్స్, డైనమిక్ కెమెరా మూమెంట్స్ కట్టిపడేశాయి.ఏఆర్ రెహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు ఆత్మలా నిలిచింది. ఎమోషన్స్‌ను, యాక్షన్‌ను ఒకేసారి ఎలివేట్ చేస్తూ ఆయన ఇచ్చిన స్కోర్ ట్రైలర్‌ను మరింత పవర్‌ఫుల్‌గా మార్చింది.ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌లో నిర్మించిన ఈ సినిమా ప్రతి ఫ్రేమ్ కూడా బిగ్ స్క్రీన్ అనుభూతిని కలిగిస్తోంది. ప్రేక్షకులను పూర్తిగా లీనం చేసే ఎక్స్ పీరియన్స్ అందిస్తుంది. విడుదలకు ఇంకా కొద్ది రోజులు మాత్రమే ఉండగా.. ట్రైలర్ తో 'పెద్ది'పై అంచనాలు ఇప్పుడు తారాస్థాయికి చేరుకున్నాయి. ముంబైలో గ్రాండ్‌గా జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ... గుడ్ ఈవెనింగ్ ముంబై. మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు అన్నారు.



## "సుధీర్ జోకర్" టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్

వుదయం సినిమా


సుడిగాలి సుధీర్ హీరోగా "సుధీర్ జోకర్" అనే కొత్త చిత్రం రాబోతోంది. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం అవ్వబోతుంది .ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. రేపు హీరో సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ ఈ రోజు "సుధీర్ జోకర్" టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఈ రోజు రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో ప్లేయింగ్ కార్డ్స్ తో ఉన్న సుడిగాలి సుధీర్ ఆకట్టుకుంటున్నారు. రేపు ఈ సినిమా బాంగర్ రిలీజ్ తో పాటు ఫ్యాన్స్ తో ఇంటరాక్షన్ కూడా జరగబోతోంది. కంప్లీట్ కమర్షియల్ ఎంటర్ టైనర్ గా "సుధీర్ జోకర్" సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని డీటెయిల్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.



## కమల్ హాసన్ స్ఫూర్తిదాయక నిర్ణయం

వుదయం సినిమా

సినిమా పరిశ్రమ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఈ సమయంలో యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది. ప్రైవేట్ చార్టర్స్, లగ్జరీ ట్రావెల్స్‌ను పక్కన పెట్టి సాధారణ ఎకానమీ ఫ్లైట్ లో ప్రయాణిస్తూ నేరుగా షూటింగ్ సెట్స్‌కు వెళ్లిన కమల్ హాసన్ సింప్లిసిటీ స్ఫూర్తిగా నిలిచింది.ఎంత స్టార్ డమ్ ఉన్నప్పటికీ సినిమాపై ప్రేమ, బాధ్యత ముఖ్యమని కమల్ హాసన్ మరోసారి నిరూపించారు. ప్రస్తుతం సినీ పరిశ్రమ కొత్త ఆలోచనల వైపు అడుగులు వేస్తున్న సమయంలో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం ఇండస్ట్రీకి ఒక స్ఫూర్తిదాయకమైన సందేశంగా మారింది.పరిశ్రమ కోసం మార్పు మన నుంచే మొదలుకావాలనే కమల్ హాసన్ తీసుకున్న చొరవకు సోషల్ మీడియాలో ప్రశంసలు అందుతున్నాయి. సినిమా రంగంలో జరగబోయే గొప్ప మార్పులకు ఇది తొలి అడుగు కానుంది.




## 'ది రెడ్ బ్యాగ్' చిత్రంలో సావిత్రి పాత్రలో రాశీ

వుదయం సినిమా

మెమరీ మేకర్స్ బ్యానర్ మీద డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్‌తో కొత్త నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి 'ది రెడ్ బ్యాగ్' అనే సినిమాని నిర్మిస్తున్నారు. బ్యాగ్ చుట్టూ తిరిగే ఈ మూవీకి రవి కుమార్ సీరపు కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు.ఈ చిత్రంలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. తాజాగా ఈ సినిమా నుంచి స్పెషల్ రోల్ పోషిస్తున్న రాశీ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.సావిత్రి పాత్రలో రాశీ 'ది రెడ్ బ్యాగ్' సినిమాలో ఓ పవర్ ఫుల్ రోల్‌ను పోషించారు.




## సినీ నటి హిమజ, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చేతుల మీదుగా 'హబీబ్స్' సెలూన్ ప్రారంభం!

ప్రముఖ హెయిర్ అండ్ బ్యూటీ బ్రాండ్ 'హబీబ్స్' సరికొత్త ప్రీమియం సెలూన్ శాఖ హైదరాబాద్ లోని చందానగర్‌లో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. అమీన్‌పూర్ రోడ్, సురక్ష కాలనీ, పద్మజానగర్‌లోని సంజీవని డయాగ్నోస్టిక్స్ సెంటర్ పై అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ నూతన సెలూన్ ప్రారంభోత్సవ వేడుకకు ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటి హిమజ విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి సెలూన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా నటి హిమజ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి జీవనశైలికి ఆకర్షణీయమైన రూపాన్ని అందించడంలో బ్యూటీ సెలూన్లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. దేశంలోని పట్టణ మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి వర్గాల వారికి అందం, అలంకరణ రంగంలో సేవలు అందిస్తున్న హబీబ్స్ సెలూన్ బ్రాండ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందని ఆమె అన్నారు.ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ... " బాచుపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన 'హబీబ్స్' న్యూ ప్రీమియం సెలూన్ స్థానికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నాను అన్నారు.



వుదయం సినిమా



వుదయం సినిమా

## #చిరుబాబీ2 / #చిరు158 చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా విజయ్ కార్తిక్ కన్నన్

మెగాస్టార్ చిరంజీవి సెన్సేషనల్ సంక్రాంతి బ్లాక్‌బస్టర్ వాల్తేర్ వీరయ్య తర్వాత మరో మాస్ ఎంటర్‌టైనర్ కోసం సక్సెస్ ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లితో మరోసారి జతకడుతున్నారు. ఈ చిత్రాన్ని సుప్రసిద్ధ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. #చిరుబాబీ2 / #చిరు158 మే 21న అధికారికంగా ప్రారంభం కానుంది.ఇప్పుడు మేకర్స్ టీమ్‌లోకి మరో బలమైన టెక్నికల్ టాలెంట్‌ను తీసుకొచ్చారు. 'జైలర్', 'డాకూ మహారాజ్', అలాగే రాబోయే 'జైలర్ 2' చిత్రాలతో తన విజువల్ స్టైల్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తిక్ కన్నన్ ఈ చిత్రానికి డీవోపీగా అధికారికంగా జాయిన్ అయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రకటన చేయడంతో ఈ అప్డేట్ మరింత స్పెషల్‌గా మారింది.

## జొన్నవిత్తుల దర్శకత్వంలో వస్తున్న మూవీ "లలిత"

ప్రముఖ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం "లలిత". ఈ సినిమాను కాస్మిక్ పవర్ క్రియేట్స్ LLP బ్యానర్‌పై పి. సుధీర్ రాజు, డి. వైష్ణవి నేహా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో నందిని హీరోయిన్‌గా, అభిలాష్ పీలా, అఖిల్ వివాన్ హీరోలుగా పరిచయమవుతున్నారు. "లలిత" చిత్రానికి సంగీతాన్ని మ్యూజికల్ ద్యుయో మణి, నాగరాజు అందిస్తున్నారు. నాగరాజు ప్రముఖ వేణువాదకుడు కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి "కళారత్న" మరియు "వేణుగాన విశారద" పురస్కారాలు అందుకోవడం విశేషం.



వుదయం సినిమా

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.